J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 36 07.02.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# ఈసారి జగన్ 2.0ని చూస్తారు - వైసీపీ అధినేత

## కోటరీని, కోటని వదలరా.. మీరు అసలు మారరా? - పార్టీ శ్రేణులు



- తప్పులకు, తలనొప్పులకు కారణమైన వారికే మళ్ళీ పెద్దపీట
- ఇన్‌ఛార్జిల పేరిట వాళ్ళకే పదవులు
- తలపట్టుకుంటున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు
- అధినేతకు చెప్పే ధైర్యం లేక అంతర్మథనం

లండన్ నుండి బెంగళూరు మీదుగా తాడేపల్లికి చేరుకున్న జగన్, ఫిబ్రవరి 5వ తేదీ బుధవారం విజయవాడ మునిసిపల్ కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని ఆసక్తికరమైన మాటలు మాట్లాడారు. ఆయనేమన్నారో కొన్ని ఆయన మాటల్లోనే ....

*"జగన్ 1.0లో ప్రజలకి మంచి చేసే క్రమంలో కార్యకర్తలని నిర్లక్ష్యం చేశాను. ఇప్పుడు నేను మారిన జగన్‌ని. జగన్ 2.0ని. ఇప్పుడు నాలో కొత్త మనిషిని చూస్తారు. ఎక్కడైనా వైసీపీ కార్యకర్తకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోను. నాలో మరో కోణం చూపిస్తా. వైసీపీ కార్యకర్త వెంట్రుక కూడా ఎవరూ పీకలేరు. మళ్ళీ అధికారంలోకి వస్తాం, 30 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలిస్తాం. భవిష్యత్తులో జగన్ 2.0లో కొత్త కోణం చూస్తారు."*

ఇవీ ఆయన మాటల్లోని కొన్ని ముఖ్యాంశాలు.

అయితే, వైసీపీ శ్రేణుల్లో మాత్రం విభిన్న వాదనలు వినపడుతున్నాయి. జగన్ చెప్పే విషయానికీ, చేసేపనికీ పొంతన లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు పార్టీలో అంతర్గతంగా ఏం జరుగుతోంది..? పార్టీశ్రేణులు, ద్వితీయ స్థాయి నాయకులు ఏమనుకుంటున్నారు..? కార్యకర్తల అంతర్మథనం ఏమిటి అన్న అంశాలపై ఓ పరిశీలన..!

జగన్.. ఎనిమిది నెలల క్రితం వరకు ఇది రాష్ట్రాన్ని శాసించిన పేరు.. కేంద్రం వద్ద అనుకున్నది చేయించుకున్న పేరు.. ఏపీలోనే కాకుండా తెలంగాణ నాయకులూ కొన్నిసార్లు జేజేలు పలికిన పేరు.. కానీ, నేడు పరిస్థితులు వేరు.. ఆంధ్రలో బద్ధశత్రువువైన చంద్రబాబు.. తెలంగాణలో శత్రువుకు మిత్రుడైన రేవంత్‌రెడ్డి.. ఇక హస్తినలో అయితే చూడగానే ఆమడదూరం పారిపోయే నాయకులు.. అధికారగణం వెరసి.. నా అనే నాథుడే లేరు.. నిజానికి ఇదంతా ఆయన స్వయంకృత అపరాధమా..? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. రాజప్రసాదం లాంటి తాడేపల్లి కోట.. అందులో ఆయన చుట్టూ చేరి ఉన్నవి లేవిని చెప్పి పబ్బం గడుపుకునే కోటరీ. వీరివల్లే సింహం సింగిల్‌గా వస్తుందన్న జగన్.. సింగిల్ డిజిట్ స్థాయికి చేరిపోయారు. ప్రజల ఆదరణతో పాటు అధికారానికి దూరమయ్యారు. ఇంత జరిగినా తన తీరును మాత్రం జగన్ మార్చుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం దొంగచేతికి తాళాలిచ్చినట్లు తన ఓటమికి కారణమైన కోటరీ నాయకులకే మళ్లీ పదవుల్లో పాధాన్యమిస్తుండడమే అని సర్వత్రా వినపడుతోంది..!

తప్పులను ఎప్పటికప్పుడు సరిదిద్దుకోకుంటే ఏ రంగంలో అయినా విజయం సాధించడం కష్టం.

10లో

# బలి కోరుతున్న భక్తి




- పర్వదినం అంటే ప్రాణాలు పోవాల్సిందేనా?
- దేశాన్ని కలవరపెడుతున్న ఆధ్యాత్మిక ప్రమాదాలు

"హిందూయిజం" ముక్కోటి దేవతలకు నిలయమైన కమ్యూనిటీ. కోటానుకోట్ల భక్తులకు సనాతన ధర్మాన్ని తెలియజేసే మతం. ప్రకృతి ప్రసాదించిన గాలి..నీరు, మట్టి..పుట్ట, రాయి..రప్ప, చెట్టు..చేమ ఏదైనా వారికి భగవంతుడి స్వరూపమే. చివరికి ఇంట్లో పెంచుకునే గోవును లక్ష్మీదేవిగా, కుక్కను కాలభైరవస్వామిగా భావించి ఆరాధిస్తారు. అలాంటి పవిత్రమైన భావాలతో దైవదర్శనానికో పుణ్యస్నానాలకో వెళ్తున్న ప్రజలు అక్కడ ఆపదల్లో చిక్కుకుంటున్నారు. కొన్నిసార్లయితే తొక్కిసలాట జరిగి ఇతరుల పాదాలకింద నలిగి దుర్భరస్థితిలో ప్రాణాలు కోల్పోతున్నారు. పుష్కరాలు, ఏకాదశి దర్శనాలు, కుంభమేళాలు ఇలా పర్వదినం ఏదైనా ప్రాణాలు పోగొట్టుకోవడం మాత్రం నిత్యకృత్యంగా మారిందంటే అతిశయోక్తి కాదేమో.

10లో



# 9న.. ఆత్మకూరు అభివృద్ధికి శ్రీకారం

## ➢ నలుగురు మంత్రులతో కలసి ప్రారంభిస్తామన్న మంత్రి ఆనం


గత పదేళ్లుగా ఆత్మకూరు నియోజక వర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనుల ప్రారంభానికి తిరిగి శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఫిబ్రవరి 9న నలుగురు మంత్రులతో కలసి ఆత్మకూరులో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపడతామన్నారు. ఆమేరకు ఆయన ఇటీవల జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించారు. మంత్రులు పొంగూరు నారాయణ, సత్య కుమార్‌యాదవ్, సవిత, బీసీ జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని మంత్రి చెప్పారు.



అదేవిధంగా, ఆత్మకూరుకు మంజూరైన బీసీ బాలికల గురుకుల పాఠశాలను తాత్కాలికంగా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభించనున్నామన్నారు. రూ. 9.6 కోట్లతో ఆత్మకూరు పట్టణానికి తాగునీటి సరఫరా కోసం అమృత్-2 పథకానికి పనులు మొదలుపెట్టనున్నట్లు చెప్పారు. ఆధునీకరించిన ఆత్మకూరు ఆర్ అండ్ బి అతిథి గృహాన్ని ప్రారంభిస్తామన్నారు. రూ. 1.70కోట్లతో పంచాయతీరాజ్ అతిథి గృహం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ హైస్కూల్‌లో పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హకారంతో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 107మంది వికలాంగులకు మోటరైజ్‌డ్ ట్రై సైకిల్స్ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రూ. 30లక్షలతో మున్సిపాలిటీకి లిఫ్ట్, రూ. 2కోట్లతో రిజర్వాయర్ బ్యూటిఫికేషన్ పనులు చేయనున్నట్లు చెప్పారు.

## అనురాగమూర్తి - ఆత్మీయదీప్తి - సేవాస్ఫూర్తి

# డాక్టర్ కే.ఎల్.రెడ్డి కన్నుమూత!



***అ**మెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో మంచికి, మానవీయతకి మారుపేరుగా ఖ్యాతి గడించిన డాక్టర్ కే.ఎల్.రెడ్డి అక్కడి కాలమాన ప్రకారం జనవరి 30వ తేదీ రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 78సంవత్సరాలు. కే.ఎల్.రెడ్డి పూర్తి పేరు కాకుటూరు లక్ష్మీనరసారెడ్డి. ఆయన స్వస్థలం నెల్లూరుజిల్లా అల్లూరు. కాకుటూరు వెంకారెడ్డి - విమలమ్మల రెండవ సంతానంగా 1946 అక్టోబర్ 12న లక్ష్మీనరసారెడ్డి జన్మించారు. ఆయన తండ్రి డాక్టర్ వెంకారెడ్డి తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో వివిధ హోదాలలో సేవలందించి పదవీ విరమణ పొందారు. ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతిగా కూడా తమ సేవలందించారు. చివరిగా స్టూడెంట్స్ అఫైర్స్ డీన్‌గా పనిచేసి వెంకారెడ్డి రిటైర్డ్ అయ్యారు.*

కే.ఎల్.రెడ్డి బాల్య విద్యాభ్యాసమంతా తిరుపతి మునిసిపల్ హైస్కూల్లో జరిగింది. మణిపాల్‌లోని కస్తూర్బా మెడికల్ కాలేజీ నుండి డాక్టర్ పట్టా పుచ్చుకున్నారు. ఆ తరువాత తమిళనాడులోని రావతకుప్పంలో లెప్రసీ సెంటర్‌లో కొన్నాళ్ళు వైద్యుడిగా సేవలందించారు. స్వయానా తన మేనత్త (నాన్న చెల్లెలు) శకుంతలమ్మ - వెంకట కృష్ణారెడ్డిల ఏకైక కుమార్తె జానకిని 1970, మార్చి 29న నెల్లూరులో పరిణయమాడారు. వీ.ఆర్. కళాశాలలో నంబర్‌వన్ ఎకనామిక్స్ లెక్చరర్‌గా టీ.వీ.కృష్ణారెడ్డిని అభిమానించని ఆ తరం విద్యార్థినీవిద్యార్థులు ఉండరు. అంతలా ఆయన ప్రసిద్ధి.



తన మామ టి.వి.కృష్ణారెడ్డి, సతీమణి జానకిలతో లచ్చయ్య

కొద్దికాలం భారతదేశంలో పనిచేసిన అనంతరం పైచదువుల కోసం లక్ష్మీనరసారెడ్డి 1974లో అమెరికాకి వెళ్ళి అక్కడే స్థిరపడిపోయారు. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో బ్రూక్లిన్ కుంబర్ ల్యాండ్ హాస్పిటల్లో రెసిడెన్సీ చేశారు. అనంతరం అదే నగరంలో బ్రూక్‌డేల్ హాస్పిటల్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఫెలోషిప్ చేసి, తరువాత తన మకాం ఫ్లోరిడా రాష్ట్రానికి మార్చారు. అప్పటినుండి నాలుగున్నర దశాబ్దాలకిపైగా ఆయన ఫ్లోరిడా రాష్ట్రంలోనే ఉండిపోయారు.

లక్ష్మీనరసారెడ్డికి నలుగురు పిల్లలు. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారిలో ఒక కుమార్తె చిన్నతనంలోనే ప్రమాదవశాత్తు కన్నుమూసింది.

### స్నేహశీలి, సహనశీలి, సౌమ్యశీలి!

కే.ఎల్.రెడ్డిని ఆయన కుటుంబసభ్యులంతా రకరకాలుగా పిలుచుకునేవాళ్ళు. పెద్దవాళ్లు లచ్చయ్య అని పిల్చుకుంటే, చిన్నవాళ్ళు లచ్చన్న, లచ్చమామ, లచ్చ పెదనాన్న, లచ్చ తాత అని సంబోధించేవాళ్ళు. లచ్చయ్యకి స్నేహితులంటే ప్రాణం, ఆయన మిత్రులకి లచ్చయ్య అంటే పిచ్చి. కోపం అనే నరం ఆయన శరీరంలో లేదు. తన మిత్రులతో కలిసిపోతారు, చిన్నపిల్లలలో ఇమిడిపోతారు, పెద్దవాళ్ళ ముందు ఒదిగిపోతారు. సకల సద్గుణాలున్న అరుదైన వ్యక్తి లక్ష్మీనరసారెడ్డి.

తన పేషెంట్లకి ఆయన దైవంతో సమానం. ధార్మిక, ఆధ్యాత్మిక, సేవారంగాలలో కూడా ఆయన ఎక్కడా తగ్గలేదు. ఓ వైపు తన వైద్య వృత్తిలో తలమునకలవుతూనే మరోవైపు సమాజ సేవలో, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనేవారు. అదే తరుణంలో తన కుటుంబానికి ఏనాడు ఎక్కడా లోటు రానీయలేదు. తన పిల్లలకి ఒక్క క్షణం కూడా తన ప్రేమని దూరం కానీయలేదు. అంతలా ఆయన అన్ని విషయాలలో సమాంతర న్యాయం చేసేవారు. ఎప్పుడూ చెరిగిపోని చిరునవ్వుతో తనకి ఎదురైన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించేవారు. ఫ్లోరిడా తెలుగు సంఘం వ్యవస్థాపక సభ్యుడిగా ఆయన సేవలు చిర స్మరణీయం. కే.ఎల్.రెడ్డి జ్ఞాపకశక్తి కూడా అపారం. తన చిన్ననాటి స్నేహితులని కూడా పేరుపేరునా తల్చుకునేవారు. మాతృభాషపై మమకారం చాలా ఎక్కువ. తెలుగువాళ్ళు ఎదురైతే ఒక్క పదం కూడా ఆంగ్లం ఉచ్చరించకుండా వాళ్ళతో తెలుగులోనే మాట్లాడేవారు. తెలుగులో జాబు రాస్తే మచ్చుకైనా ఒక్క ఆంగ్ల పదం కనపడకుండా స్వచ్ఛమైన తెలుగులోనే రాసేవారు. సంగీతమంటే కూడా ఆయనకి ప్రాణం. ముఖ్యంగా భారతీయ సినిమా గాయకులు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యమంటే కే.ఎల్.రెడ్డికి పిచ్చి అభిమానం. బాలు మరణం కే.ఎల్.రెడ్డిని బాగా కుంగ దీసిందంటే అతిశయోక్తి కాదేమో.

ఒక్క ముక్కలో చెప్పాలంటే బహుముఖ ప్రజ్ఞాశాలి కాకుటూరు లక్ష్మీనరసారెడ్డి. 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు తుంగా రాజగోపాలరెడ్డి సతీమణి శ్రీదేవమ్మకి స్వయానా అక్క కొడుకు లచ్చయ్య. కొంతకాలంగా స్వల్ప అనారోగ్యంతో బాధపడుతుండిన ఆయన జనవరి 30న అకస్మాత్తుగా గుండెపోటుతో తన వాళ్లందరినీ వదలి దివ్యలోకాలకి తరలిపోయారు. అమెరికా కాలమాన ప్రకారం ఫిబ్రవరి 6వ తేదీ ఉదయం లచ్చయ్య ఆప్తులు, ఆత్మీయులు, హితులు, సన్నిహితులు, స్నేహితులు, కుటుంబసభ్యుల శోకతప్త హృదయాల మధ్య ఆయన అంత్యక్రియలు జరిగాయి. లక్ష్మీనరసారెడ్డి దివ్య ఆత్మకి సద్గతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ నివాళులర్పిస్తోంది 'లాయర్'!

# వీఆర్‌సీకి త్వరలో మహర్దశ!

## కార్పొరేట్‌కు ధీటుగా మారనున్న విద్యాలయం

### - మంత్రి నారాయణ



గత ప్రభుత్వం అథఃపాతాళానికి నెట్టేసిన చరిత్రాత్మక నెల్లూరు వీఆర్ కళాశాలకు కూటమి ప్రభుత్వంలో మళ్లీ మహర్దశ రానుంది. గతంలో కంటే మిన్నగా, కార్పొరేట్ స్థాయికి ధీటుగా పేద విద్యార్థులకు విద్యను బోధించేందుకు ఎన్నికైన విద్యాలయాల్లో నెల్లూరు వీఆర్‌సీ ఒకటి కావడం విశేషం. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆలోచనలమేరకు రాష్ట్రంలో నాలుగు విద్యాసంస్థలను అత్యున్నత ప్రమాణాలు కలిగిన విద్యాలయాలుగా తీర్చిదిద్దాలని భావిస్తుండడం, అందులో ఒకటి నెల్లూరు విఆర్‌సి కావడం నెల్లూరీయుల అదృష్టమనే చెప్పాలి. రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి, వీఆర్‌సీతో గతం నుంచి మంచి అనుబంధం ఉన్న డాక్టర్ పొంగూరు నారాయణ ఇటీవల స్వయంగా ఆ విషయాలను వెల్లడించారు. సంతపేటలో ఉన్న ఆదర్శ ఉన్నత పాఠశాలను అధికారులతో కలసి సందర్శించిన సందర్భంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివృద్ధి చేయనున్న ఒక్కో విద్యాసంస్థలో సుమారు 2వేల మందివరకు విద్యార్థులకు బోధన చేసేలా ప్రణాళిక రూపొందించడం జరిగిందని, నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఆ విద్యాలయంలో విద్యాబోధన ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, అత్యాధునిక సౌకర్యాలతో పాటు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందించేలా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అంతేకాదు, దాదాపు 2కోట్ల రూపాయలతో నెల్లూరు నగరంలోని మున్సిపల్ హైస్కూళ్లలో జిమ్, ఆట వస్తువులను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తొలుత సంతపేట మోడల్ స్కూల్, నవాబుపేటలోని బివిఎస్ బాలికల హైస్కూల్‌లో ఈ క్రీడా పరికరాలు, జిమ్ సామగ్రి అమర్చనున్నట్లు చెప్పారు. సంతపేట మోడల్ స్కూల్ వెనుకవైపున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, బాస్కెట్‌బాల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడలకు అవసరమైన విధంగా తీర్చిదిద్దేందుకు వారంలోగా నివేదిక అందించాలని మున్సిపల్ అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. మంత్రి వెంట సంతపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు ఉన్నారు.

# ఉత్తమ పంచాయతీగా మిక్కిలింపేట



ఉత్తమ పంచాయతీగా ఇటీవల కొడవలూరు మండలం మిక్కిలింపేట ఎంపికైంది. ఆమేరకు సర్పంచ్ కోడూరు చంద్రశేఖర్‌రెడ్డి కేంద్రం నుంచి ప్రశంసాపత్రం అందుకున్న సందర్భంగా ఆయన్ను వేమిరెడ్డి దంపతులు ఇటీవల ఘనంగా సన్మానించారు. చంద్రశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ప్రతి గ్రామ సర్పంచ్ గ్రామాభివృద్ధికి పాటుపడాలని వారు కోరారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చడంలో ప్రత్యేకశ్రద్ధ చూపి జాతీయస్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా ప్రశంసలందుకున్న కోడూరు చంద్రశేఖర్‌రెడ్డిని నాయకులంతా అభినందించారు.

# ప్లాస్టిక్ వాడకం వద్దనే వద్దు



పర్యావరణానికి నష్టం కలిగించే ప్లాస్టిక్ వాడకం వద్దనే వద్దని విశ్రాంత అడిషనల్ పోలీస్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. నెల్లూరులోని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మూలపేటలోని ఇఎస్‌ఆర్‌ఎం హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్ధాలను వివరించారు. యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం మంచిదికాదన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని ఒక ఉద్యమంలాగా చేపట్టాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ వాడకాన్ని నివారిస్తామని అందరిచేతా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతు లను అందజేశారు.

## మాగుంట శ్రీనివాసులరెడ్డికి బైపాస్ సర్జరీ!



ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డికి బైపాస్ సర్జరీ జరిగింది. ఇటీవల ఆయన కొంత స్వల్ప అనారోగ్యానికి గురవడంతో డాక్టర్లు ఆయనకి గుండె శస్త్ర చికిత్స అవసరమని సూచించారు. ఫిబ్రవరి 6వ తేదీ గురువారం, ఉదయం చెన్నై అపోలో ఆసుపత్రిలో ఆయనకి బైపాస్ విజయవంతంగా జరిగింది. ప్రస్తుతం ఆయన ఐసీయూలో కోలుకుంటున్నారు. ఫిబ్రవరి 5వతేదీ ఒక వీడియో సందేశం ద్వారా ఆయనే స్వయంగా తన శస్త్ర చికిత్స గురించి తెలియజేశారు. తమ కుటుంబ అభిమానులు, ప్రకాశం, నెల్లూరుజిల్లాల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పరిపూర్ణ ఆరోగ్యంతో రెట్టింపు ఉత్సాహంతో మళ్ళీ ప్రజాసేవలో పాల్గొనడానికే తాను ఈ శస్త్ర చికిత్స చేసుకుంటున్నట్లు ఆ వీడియోలో పేర్కొన్నారు. మాగుంట శీనయ్య త్వరగా కోలుకుని ఆయురారోగ్యాలతో తిరిగిరావాలని కోరుకుంటోంది 'లాయర్'.

## వైద్యులు మానవతా దృక్పథంతో ఉండాలి

**- ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి**



ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళి వైద్యం చేయించుకోలేని పేద ప్రజల పట్ల వైద్యులు మానవతా దృక్పథంతో సేవలందించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఇటీవల కోవూరు కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగవైకల్యం వున్నవారికి యిచ్చే దివ్యాంగ సర్టిఫికెట్ల విషయంలో జాప్యం చేయవద్దన్నారు. అక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి ఆమె రోగులను అడిగి తెలుసు కున్నారు. మార్చురీలో మృతదేహాలు భద్రపరి చేందుకు ఫ్రీజర్ లేదన్న విషయాన్ని డాక్టర్ల ద్వారా తెలుసుకొని, విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఆసుపత్రికి కావాల్సిన ఫ్రీజర్, మరియు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీమిచ్చారు. 5కోట్లతో ఆసుపత్రి భవన నిర్మాణం కోసం కృషిచేస్తున్నామన్నారు. కోవూరు కమ్యూనిటి హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటచలపతి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లికార్జునరెడ్డి, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ కోటపై..
## కాషాయ జెండా?

దాదాపు రెండున్నర దశాబ్దాల తరువాత ఢిల్లీ కోటపై కాషాయ జెండా ఎగరనుందా? ఎగ్జిట్‌పోల్స్ అన్నీ ముక్తకంఠంతో అవుననే జోస్యం చెప్తున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి పీఠాన్ని బీజేపీ జారవిడుచుకుని 27 సంవత్సరాలయ్యింది. మూడు దశాబ్దాలకి పైగా కాంగ్రెస్, ఆ తరువాత పదేళ్ళుగా ఆమ్‌ఆద్మీ పార్టీ ఢిల్లీ గద్దెని ఏలాయి. తాజాగా ఫిబ్రవరి 5వ తేదీ బుధవారం నాడు ఢిల్లీ అధికారం ఎవరికి ఇవ్వాలన్నదానిపై ప్రజలు తీర్పు చెప్పారు. ఆ తీర్పు బ్యాలెట్ బాక్సుల్లో భద్రంగా ఉంది. ఈసారి ఢిల్లీ ఎన్నిక అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఉన్న 70స్థానాలలో 699 మంది అభ్యర్థులు వివిధ పార్టీల నుండి పోటీచేశారు. బీజేపీ, ఆప్, కాంగ్రెస్ ప్రధానంగా తలపడ్డప్పటికీ కాంగ్రెస్‌ని ఢిల్లీ ఓటర్లు కూడా పెద్దగా పట్టించుకోలేదన్నది సర్వేరాయుళ్ళ అభిప్రాయం. శనివారం 8వతేదీ బాక్సులు బద్దలై పార్టీల భవిష్యత్తు తేలనుంది. సర్వే సంస్థలు ఊహించినట్లుగా ఇక్కడ కూడా కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూస్తే ఇక ఆ పార్టీ చాప చుట్టేయడమే మంచిది..!

## నేలపట్టుకి శ్రీసిటీ ఫౌండేషన్ చేయూత

**● పక్షుల రక్షణ కోసం 10 లక్షల విరాళం**




నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం అభివృద్ధి కోసం శ్రీసిటీ తనవంతు చేయూతనం దించింది. తన కార్పొరేట్ సామాజిక బాధ్యతలో (సీఎస్ఆర్) భాగంగా శ్రీసిటీ ఫౌండేషన్ అటవీశాఖకు ఈనెల 3న 10 లక్షల రూపాయలు విరాళంగా అందజేసింది. తిరుపతి జిల్లాలో వలస పక్షు లకు ఆటపట్టయిన నేలపట్టు పక్షుల అభయారణ్యంలో మౌళిక సదుపాయాల కల్పన, సందర్శకుల వసతుల పెంపునకు ఈ విరాళం ఎంతగానో తోడ్పడనుంది. సూళ్లూరుపేట డీఎఫ్‌వో హారిక, ఇతర అటవీ అధికారుల సమక్షంలో శ్రీసిటీ ఫౌండేషన్ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి ఆ విరాళం చెక్కును తిరుపతి సర్కిల్ ఫారెస్ట్ కన్సర్వేటర్ సి. సెల్వంకు అందజేశారు.

## బుచ్చి 'వైస్'ల ఎన్నిక




బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఈనెల 3న జరిగిన ఎన్నికల్లో వైస్ ఛైర్మన్‌గా యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్‌గా పఠాన్ నస్రీన్ ఎన్నియ్యారు. అనంతరం బుచ్చిలో జరిగిన కార్యక్ర మంలో వారిద్దరినీ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మోర్ల సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

### 'ఈ-వేస్ట్' ప్రణాళికపై చర్చించిన
## ఛైర్మెన్ దినేష్‌రెడ్డి



విజయవాడలోని ఏపీ ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఈనెల 5న జరిగిన బోర్డు మీటింగ్‌లో ఈ-వేస్ట్‌కి సంబంధించిన ప్రణాళికపై ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి చర్చించారు. ఈ సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఛైర్మెన్ పి.కృష్ణయ్య, ఎన్విరాన్‌మెంట్ సీఈఎస్ అనంతరాము, ఎం.డి శరవణన్ తదితరులు పాల్గొన్నారు.


## శ్రద్ధాంజలి



జననం
12.10.1946

నిర్యాణం
30.01.2025

**డాక్టర్ కాకుటూరు లక్ష్మీ నరసారెడ్డి గారు**

**(Dr. K.L.N. Reddy)**

"మూర్తీభవించిన మానవత్వం, పరిమళించే స్నేహతత్వం
ప్రేమానురాగాలు కురిపించే మానవీయ వ్యక్తిత్వం.. మీ తత్వం"

**మా ఆత్మబంధువు, ఆత్మీయ సింధువు ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...**



**- తుంగా కుటుంబం**

లాయర్
ఫిబ్రవరి 07, 2025

# మనమ్మాయిలే.. మెరుపులు మెరిపించారు!

ఔను!.. మనమ్మాయిలే.. మెరుపులు మెరిపించారు. ప్రపంచస్థాయిలో ప్రత్యర్థి ఆటగాళ్ళకు చుక్కలు చూపించారు. ప్రపంచ క్రికెట్ క్రీడాచరిత్రలో మనోళ్ళు మరో చరిత్రను సృష్టించారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఇటీవల జరిగిన అండర్ 19 టీ20 ప్రపంచకప్‌లో తిరుగులేని విజయం సాధించి విశ్వవిజేతలుగా నిలిచారు. క్రీడాప్రాంగణంలో అద్వితీయమైన ఆటతీరుతో అందరినీ ఆశ్చర్యపరిచారు. టోర్నీ మొదలైనప్పటినుంచి బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్ని విభాగాల్లో దూకుడు పెంచి ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టించారు. మన స్పిన్నర్ల బౌలింగ్‌లో పరుగులు సాధించలేక ప్రత్యర్థి బ్యాటర్లు చతికిలపడిపోయారు. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించిన దక్షిణాఫ్రికా ఆటలను కూడా సాగనీయకుండా, మనవాళ్ళు అదరగొట్టేశారు. 9 వికెట్లు సాధించి దక్షిణాఫ్రికా జట్టును చిత్తుచేసి జగజ్జేతలుగా నిలిచారు. భారత కీర్తిపతాకాన్ని విశ్వవేదికపై రెపరెపలాడించారు. ఇది భారత నారీశక్తి విజయం.. దేశానికే గర్వకారణం. అందులోనూ వరుసగా రెండోసారి ప్రపంచకప్ సాధించడం భారత మహిళామణుల ప్రతిభాపాటవాలకు నిదర్శనం. ఈ విజయంలో కీలకపాత్ర మన తెలుగమ్మాయి, తెలంగాణలోని భద్రాచలానికి చెందిన గొంగడి త్రిషదే కావడం విశేషం. అత్యద్భుతమైన ఆటతీరును ప్రదర్శించిన త్రిష పేరు ఈ సందర్భంగా ప్రపంచమంతా మారుమోగిపోయింది. అంతేకాదు, 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా త్రిష అవార్డులందుకుని తెలుగువారి సత్తాను దశదిశలా చాటింది. కర్నాటకకు చెందిన నికీ ప్రసాద్ కెప్టెన్సీలో, మన మహిళా క్రికెట్ జట్టు దిగ్గజాలను మరపిస్తూ దక్షిణాఫ్రికా జట్టుపై తిరుగులేని విజయం సాధించి వరల్డ్‌కప్‌ను కైవసం చేసుకోవడంతో దేశవ్యాప్తంగా ఆనందాతిరేకాలు వెల్లువెత్తాయి. డాషింగ్ ఓపెనర్‌గా త్రిష పరుగుల వరద ప్రత్యర్థులను షాక్‌కు గురిచేసింది. అదేవిధంగా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కమలిని, ఆయుషి శుక్లా, వైష్ణవిశర్మ, సనిక చల్కే, పరుణిక సిసోడియా.. ఇలా ఒక్కొక్కరు క్రీడాప్రాంగణంలో కొదమసింహాలై విజృంభించి, విజయాన్ని సొంతం చేసుకున్నారు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ మాటల్లో చెప్పాలంటే, 'మనోళ్లు నిజమైన చాంపియన్లుగా ఆడారు. తొలి మ్యాచ్ నుంచి ఫైనల్స్ దాకా అసాధారణమైన ఆటతీరుతో రాణించి టైటిల్ సాధించారు. ఈ టీమ్ భవిష్యత్తులో మరిన్ని అద్భుతాలు సృష్టిస్తుందని' ఆయన వారికి శుభాకాంక్షలు చెప్పారు. భారత జట్టుకు ప్రోత్సాహంగా భారత క్రికెట్ బోర్డు 5 కోట్ల రూపాయల నజరానా ప్రకటించి క్రీడాకారిణులందరినీ అభినందించింది కూడా. ఈ నేపథ్యంలో, ప్రపంచకప్‌లో దడదడలాడించిన టీమ్ ఇండియా జట్టు నుంచి నలుగురిని ఐసీసీ జట్టుకు ఎంపిక చేశారు. వారిలో త్రిషతో పాటు కమలిని, వైష్ణవిశర్మ, ఆయూషి శుక్లాలు కూడా చోటు సంపాదించుకోవడం మరో విశేషం. ఏదేమైనా, చేయూతనందించి ప్రోత్సహించాలేగానీ ఇలాంటి ఘనవిజయాలెన్నో మన క్రీడాకారిణులు సాధించి తీరుతారనేందుకు రెండు ప్రపంచకప్‌లను అందుకోవడం కంటే నిదర్శనాలింకేం కావాలీ?.. ఇప్పుడే కాదు, గతంలో కూడా ఎందరో క్రీడాకారిణులు అనేకరకాల క్రీడల్లో తమ సత్తా చాటుకున్నారు కూడా. అయితే, మనదేశంలో నేటికీ ఆటగాళ్లకు అవసరమైన వసతులు, క్రీడా మైదానాలు, తగు శిక్షణలు ఆశించినస్థాయిలో ఉండడం లేదు. గ్రామాల్లో ఎందరో మెరికల్లాంటి క్రీడాకారులున్నా వారి నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించే నాధులే లేరు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు, క్రీడాకారిణులకు ప్రోత్సాహం ఇవ్వాలి. ప్రపంచ క్రీడావేదికలపై భారత్ సత్తా చాటేందుకు ప్రతి ఒక్కరూ అన్ని విధాలా సహకారం అందించాలి. నేడు మనదేశంలో ఎందరో క్రీడాకారులు ఆర్థికస్థితి సరిగా లేక క్రీడలంటే ఆసక్తి ఉన్నా క్రీడల పోటీల్లో పాల్గొనలేక నిరాశలో ఉన్నారు. చిన్నతనం నుంచి, పాఠశాల స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిల దాకా ఎందరో క్రీడాకారులున్నా వారికి అందుతున్న ప్రోత్సాహం నామమాత్రంగానే ఉండడం అందరికీ తెలిసిందే. ఈ రంగంలో కూడా రాజకీయాలు ఎక్కువైపోయాయి. ముఖ్యంగా దేశంలోని ప్రతిప్రాంతంలో ఉన్న క్రీడాసంఘాల వారు ఇప్పటికైనా తమ వ్యక్తిగత ఆధిపత్యాన్ని చాటుకునేందుకు కాక, అసలైన క్రీడాకారులను ఎంపిక చేయాలి. కులమతాలు, పేద-ధనిక అనే తారతమ్యం లేకుండా, రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తూ, అద్భుతమైన ఆటతీరుకే అవకాశం ఇచ్చి, ప్రతిభకు పట్టాభిషేకం చేయాలి. అప్పుడే, మనం మరెన్నో ప్రపంచస్థాయి పతకాలను కూడా సాధించేందుకు, క్రీడా రంగంలో భారత్ ఘనకీర్తి మరింతగా తేజోవంతమయ్యేందుకు మార్గం వేసుకున్నట్లవుతుంది.




# పెళ్లిళ్లు ఆలస్యం - యువత జీవితాలలో నైరాశ్యం!

"ఓ! భావి భారత భాగ్య విధాతలారా! యువతీ యువకులారా...

పెళ్ళి చేసుకుని..ఇల్లు చూసుకుని.. చల్లగ కాలం గడపాలోయ్, ఎల్లరు సుఖము చూడాలోయ్, మీరెల్లరు హాయిగ ఉండాలోయ్"... అంటూ ఎప్పుడో 1952నాటి పెళ్ళిచేసిచూడు చిత్రంలోనీ గీతం ఇది. పెళ్లి చేసుకున్న తర్వాత ఇల్లు చూసుకోవాలని, కాపురాలు చక్కగా సాగించాలని గీత రచయిత పింగళినాగేశ్వరరావు ఎన్టీఆర్ చేత ఇప్పించిన సందేశం ఈ పాట సారాంశం.

అయితే, ఇప్పుడా కాలం మారింది. తరం మారింది. ఆధునికత వచ్చేశాక నేటి తరం యువత కొత్తపుంతలు తొక్కుతోంది. పాత నమ్మకాలకంటే కొత్త ఆలోచనలే వారిని బాగా ప్రభావితం చేస్తున్నాయి. 'పెద్ద చదువులు చదవాలి, మంచి ఉద్యోగం సంపాదించాలి, మంచి ఇల్లు కొనుక్కోవాలి అప్పుడే పెళ్ళి. ఆ తరువాత కూడా మీలాగా కాదు.. ఇద్దరం సంపాదిస్తే తప్ప కుటుంబం జరగదు, అంటూ తామేదో జీవితాలని చదివేసిన వాళ్ళలా నేటి యువతీ యువకులు తెగేసి మరీ చెప్తున్నారు. మధ్యతరగతి కుటుంబాల్లో ఈ తరహా అభిప్రాయాలు మెండుగా ఉంటున్నాయి. అయితే, ఆ పెద్దచదువులు పూర్తయ్యేదెప్పుడు?.. మంచి ఉద్యోగం వచ్చేదెప్పుడు? వాళ్ళు ఇల్లు కొనేదెప్పుడు, ఆ తరువాత పెళ్లయ్యేదెప్పుడు?ఇక పిల్లల్ని కనేదెప్పుడు?.. అంటూ పెద్దవాళ్ళు నిట్టూర్పుతో తలలు పట్టుకుంటున్నారు.

## నాడు పెళ్ళంటే ఆత్మీయ బంధం... నేడు ఆర్థిక సంబంధం!

భర్త సంపాదనపరుడుగా, భార్య గృహిణిగా ఉంటూ ఇద్దరూ సంసార రథానికి రెండు చక్రాలుగా ఉండాలన్న పాతకాలపు ఆచారాలకు ఎప్పుడో కాలం చెల్లిపోయింది. ఇద్దరూ ఎంతోకొంత సంపాదించుకుంటే తప్ప కుటుంబాలు గడవని రోజులివి. ఆర్థికంగా స్థిరపడకుండా పెళ్ళి చేసుకుంటే మెడకో గుదిబండ తగిలించుకున్నట్లేనని యువత భావిస్తుండడంతో, వివాహాల్లో అనివార్యమైన జాప్యం జరుగుతూ, క్రమేణా వివాహబంధాలకి, అనుబంధాలకి వారు దూరం అవుతున్నారు. ఒకప్పుడు పెళ్ళంటే నూరేళ్ల పంట.. ఇప్పుడు 'చేతిలో డబ్బు లేకుంటే అది నూరేళ్ళ మంట' అంటూ ముక్కుతిప్పుతున్నారు ఆడపిల్లలు. అందుకే ముందుగా తమనుతాము నిలదొక్కుకోవడానికి యువకులతో పాటు, యువతులు కూడా పోటీపడుతున్నారు. మంచి ఉద్యోగం ఉంటే మంచి భర్త లేదా భార్య వస్తారన్నది వారి మనసులో మాట. నిజమే మరి!. రోజురోజుకీ పెరుగుతున్న ధరలతో, జీవితమెలా గడపాలో, పిల్లల చదువులకీ.. కుటుంబ ఖర్చులకీ ఎంతవుతుందో వారి ప్రణాళికలు వారికుంటాయి. యువకులు కూడా ఈ విషయంలో గట్టి పట్టుదలతో ఉండడం, ప్రభుత్వోద్యోగాలు వస్తే బాగుంటుందని ఏళ్ళ తరబడి నిరీక్షిస్తుండడంతో, దేశంలో 30 ఏళ్ళలోపు వివాహం కాని యువకుల సంఖ్య నానాటికీ బాగా పెరిగిపోతూనే ఉంది.

## ఆలస్యపు వివాహాలతో అనేక అనర్థాలు

అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు దాటితే వివాహాలు చేసుకోవచ్చు. కానీ, పీజీలు, పీహెచ్‌డీలంటూ ఉన్నత చదువులు చదవాల్సి రావడం, పెద్ద ఉద్యోగాలు వచ్చినా అవి స్థిరంగా ఉండేదాకా ఆగడం, ఈలోగా వయసు 30 దాటిపోతుండడం సర్వసాధారణమైపోయింది. దీంతో, 35ఏళ్ళు వచ్చినా పెళ్ళికాని వాళ్లు మనదేశంలో లక్షల సంఖ్యలోనే ఉంటున్నారని గణాంకాలు చెప్తున్నాయి. చివరికి అన్నీ కుదురుకున్నాక పెళ్ళికి ఓకే అనగానే పెళ్లయిపోతుందా?.. పెళ్లంటే మాటలా?.. ఎన్ని తతంగాలు జరగాలో !.. ఈ కాలంలో అబ్బాయిలకి, అమ్మాయిలకి, తల్లితండ్రులకి అదో పెద్ద కసరత్తు అవుతోంది. ఒకవేళ అందరి అదృష్టం బాగుండి, నచ్చినవారిని పెళ్ళిచేసుకునేనాటికి 35 ఏళ్ళు వచ్చాయనుకోండి..ఆ తర్వాత పిల్లలు పుట్టి, ఆ పిల్లలకి ఓ 20 ఏళ్ళు వచ్చేసరికి, వీరికి 55 ఏళ్ళు దాటిపోతాయి. ఇక ఆ పిల్లలకి పెళ్ళిళ్ళు అయ్యేసరికి వీరు అమ్మానాన్నల స్థానం నుంచి అవ్వాతాతల స్థాయికి వెళ్ళిపోతారు. అంతేకాదు, ఆలస్యపు వివాహాల వల్ల అనేక అనర్థాలున్నాయంటున్నారు వైద్య నిపుణులు. శారీరక, మానసిక అనారోగ్యాలు బాధిస్తాయని, సంతానోత్పత్తి కూడా తగ్గిపోతుందని చెప్తున్నారు. సంతానం కలిగినా అటు తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉండేందుకు కూడా పలు సమస్యలు ఎదురవుతాయని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా మహిళలు వీటిబారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అయితే, పెళ్లయ్యాక తమ కుటుంబం అన్నివిధాలుగా ఉన్నతంగా ఉండాలంటూ అత్యధికశాతం మంది యువత, తమ రెక్కల కష్టాన్ని పెళ్ళికి ముందే కుటుంబవృద్ధి కోసం త్యాగం చేస్తున్నారు. పెళ్ళి వయసు దాటిపోతున్నా పెళ్లిపై నిరాసక్తత చూపిస్తున్నారు. 'ఏ వయసులో ముచ్చట ఆ వయసులో జరగాలన్న' పెద్దల మాట పెడచెవిన పెడుతున్నారు. జీవితంలో మధురమైన రోజులు మిస్సయిపోతున్నారు.

## యువతలో చైతన్యం కల్పించాలి!

ప్రభుత్వాలు , ముఖ్యంగా కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలు చొరవ తీసుకుని యువతీ యువకులలో చైతన్యం కల్పించాలి. వైవాహిక జీవితం పట్ల వారికి ఆసక్తి కలిగేలా కౌన్సిలింగ్ చేయాలి. జీవితంలో సంపాదన, డబ్బే ప్రధానం కాదన్న భావన కలిగేలా యువతలో స్ఫూర్తి కలిగించాలి. కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యతను వారికి వివరించాలి. పెళ్ళి విషయంలో చదువుకున్న అమ్మాయిలు.. అబ్బాయిలు మొండి పట్టుదల వీడాలి. తమ భవిష్యత్ సంసార జీవితాలకి, శారీరక ఆరోగ్యాలకి ఇబ్బంది కలగకుండా ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలి. లేదంటే భవిష్యత్ అంధకారమే. పరిస్థితులు ఇలాగే కొనసాగితే, ఒకప్పుడు "ఒక్కరు ముద్దు... ఇద్దరు హద్దు" అని ఇచ్చిన ప్రకటనలని మార్చి "ఒక్కరితో ఆపొద్దు... ముగ్గురుంటే ముద్దు" అని ప్రచారం చేయవలసి వచ్చే రోజులు వస్తాయేమో..!

- రాజశ్రీ

# మధ్యతరగతికి ఊరటగా నిర్మలమ్మ పద్దు!

కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్లో మధ్య తరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలకి మంచి ఊరట కల్పించింది. ముఖ్యంగా ఉద్యోగస్థులకి ఈ బడ్జెట్లో పెద్దపీట వేశారు. వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులకి 12 లక్షల రూపాయల వరకూ ఆదాయపన్ను మినహాయింపు ఇవ్వడం చరిత్రాత్మక నిర్ణయం. అలాగే ఉద్యోగస్తులకు 12 లక్షలా 75వేల వరకు సున్నా పన్ను విధానం అభినందనీయం. నెలంతా కష్టపడి సంపాదించిన సొమ్ము నుండి అధిక భాగం ఆదాయపన్నుకే పోవడం ఇన్నాళ్లూ మధ్యతరగతి కుటుంబాల వారిని బాధిస్తున్న అంశం. ఇప్పుడు ఆ బాధ నుండి వారికి మోడీ, నిర్మలమ్మలు విముక్తి కల్పించారు. అలాగే జీఎస్టీ విషయంలో కూడా కొన్ని అంశాలని పునఃపరిశీలించి పన్ను విధానంలో మార్పులు తెస్తే జనం మళ్ళీ మోడీకే జైకొడతారనడంలో సందేహం లేదు!

ఆర్.పి.రామయ్య - కొండాయపాలెం.

# కుంభమేళా సాకుతో దోచుకుంటున్న విమానయాన సంస్థలు!

ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళా నిర్వహణలోనూ, వచ్చే భక్తుల కోసం చేసే ఏర్పాట్లలోనూ ఎక్కడా లోపాలు లేకుండా చూసుకోవడంలో ఇటు కేంద్ర ప్రభుత్వం, అటు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు ప్రత్యేకదృష్టి పెట్టాయనడంలో ఎలాంటి అనుమానం లేదు. కానీ, అదే తరుణంలో రవాణా రంగంపై కూడా ఆ ప్రభుత్వాలు ఓ కన్నేసి వుంటే బాగుండేది. భక్తుల సౌలభ్యం కోసం కొత్తగా రైళ్ళను ప్రవేశపెట్టడంతోనే సరిపెట్టుకోవడం విమర్శలకి దారితీస్తోంది. ముఖ్యంగా ప్రైవేటు రవాణా సంస్థలు కుంభమేళాని అడ్డంపెట్టుకుని భక్తులని నిలువుదోపిడీచేస్తున్నాయి. ప్రధానంగా విమానయాన సంస్థలైతే ఆస్తులు రాసీమన్నంతగా టిక్కెట్ల ధరలని పెంచేశాయి. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు డిమాండుని బట్టి నిముష నిముషానికీ పెంచేస్తున్నారు. కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ ఈ విషయంపై దృష్టిపెట్టాలి. విమానయాన సంస్థలని కట్టడిచేయాలి. టిక్కట్ల ధర పరిధిని మించి దాటకుండా ఉండేలా నిర్ణయించాలి. అలాగే ప్రైవేటు రవాణాసంస్థలకి కూడా నిర్దిష్టమైన ధరలని నిర్ణయించి టారిఫ్ జారీచేయాలి. భక్తులవద్ద నుండి అంతకిమించి వసూలు చేయకుండా వాటిని నియంత్రించాలి!

లక్ష్మీ భరద్వాజ్ - హైదరాబాద్.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# ప్రతిష్టాత్మకంగా ఢిల్లీ ఎన్నికలు!

దేశ రాజధాని ఢిల్లీలో ఈసారి ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా జరిగాయి. దేశవ్యాప్తంగా వున్న బీజేపీ అగ్రనాయకులు అలాగే ఆ పార్టీ మిత్రపక్షాల నేతలు ఢిల్లీ గల్లీలలో కలియ తిరిగారు. బీజేపీని గెలిపించాలంటూ విన్నపాలు చేశారు. వాళ్ళందరి శ్రమ ఫలించి ఈసారి ఢిల్లీ పీఠం కమలనాథులకే దక్కే అవకాశాలు కనపడుతున్నాయి. అలా జరిగితే ఢిల్లీలో పాగా వేయాలన్న బీజేపీ చిరకాల కోరిక కూడా నెరవేరుతుంది. అయితే ఆప్ కూడా గట్టి పోటీనే ఇచ్చింది. గెలుపోటములు బీజేపీ-ఆప్ మధ్యే వున్నాయి. కాంగ్రెస్ పూర్తిగా చతికిలపడినా ఆశ్చర్యపోనవసరం లేదు.రేపు 8వ తేదీ శనివారం నాటి ఫలితాలు ఎలావుండబోతున్నాయో చూడాలి!

యం.చంద్రమౌళి - కొత్తఢిల్లీ.



# కమనీయం.. కడు రమణీయం..
# విష్ణు - సాత్త్విక కళ్యాణం

**భా**రతదేశ 13వ ఉపరాష్ట్రపతి.. మన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు - శ్రీమతి ఉషమ్మ గారాల మనుమడు, యిమ్మణ్ణి వెంకట్ - దీపమ్మల ఏకైక కుమారుడు **విష్ణు - సాత్త్విక** (తుమ్మల కోటేశ్వరరావు - శ్రీమతి రాధికల కుమార్తె) కళ్యాణం జనవరి 31 రాత్రి తమిళనాడు, మహాబలిపురంలోని కల్దాన్ సముద్ర ప్యాలెస్‌లో అంగరంగ వైభవంగా జరిగింది.

మూడు రోజులపాటు 'న భూతో న భవిష్యతి' అన్న రీతిలో జరిగిన కళ్యాణోత్సవాలలో భాగంగా 31వ తేదీ సాయంత్రం పెళ్ళికి ముందు వధూవరుల పరిచయ వేడుక జరిగింది. ఈ వేడుకలో భారత 14వ ఉపరాష్ట్రపతి జగదీష్ ధన్‌ఖడ్ దంపతులు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దంపతులు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు అనేకమంది జాతీయస్థాయి రాజకీయవేత్తలు, ఐదు రాష్ట్రాల గవర్నర్లు పాల్గొన్నారు. వీరితో పాటు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే.స్టాలిన్ దంపతులు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామరాజు, మంత్రి సత్యకుమార్, ఇతర పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, రాజకీయ, సినీ, వ్యాపార, పారిశ్రామిక, ఆధ్యాత్మిక ప్రముఖులు ఈ సంబరాలలో పాల్గొని విష్ణు - సాత్త్వికలకి శుభదీవెనలు అందించారు. కొంగుముడి వేసుకున్న కొత్త దంపతులకి 'లాయర్' శుభాశీస్సులు.









# సప్తవాహనాలపై.. శ్రీరంగనాథుడు



నెల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామివారి దేవాలయంలో ఈనెల 4న రథసప్తమి వేడుకలు కన్నులపండువగా జరిగాయి. సప్తవాహనాల్లో కొలువుదీరిన శ్రీ రంగనాథ స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారికి స్వర్ణ గరుడసేవ, సింహ–హంస వాహనసేవలు, బంగారు తిరుచ్చిసేవ, పెద్దశేషవాహన సేవ, సూర్యప్రభ–చంద్రప్రభ వాహనసేవలు అత్యంత వైభవంగా జరిగాయి. గోవింద నామస్మరణలతో ఆలయం మార్మోగింది. ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి, దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు.

### శ్రీ గణపతి సచ్చిదానందస్వామి ఆధ్వర్యంలో..

## 'రథసప్తమి' పూజలు



రథసప్తమి సందర్భంగా నెల్లూరులోని సుజాతమ్మ కాలనీలో ఉన్న శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానందస్వామివారు ప్రత్యేకపూజలు చేశారు. ఆ పీఠం ఉత్తరాధికారి శ్రీ దత్త విజయానంద తీర్థస్వామీజీతో కలసి ఆయన ఈ పూజల్లో పాల్గొన్నారు. తలపై అఖండజ్యోతిని పెట్టుకుని, చేతుల్లో దీపాలను వెలిగించి పట్టుకుని సూర్యభగవానునికి నీరాజనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువైవున్న శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామికి నేత్రపర్వంగా వెన్నతో అలంకారం నిర్వహించారు. స్వామీజీ ఆధ్వర్యంలో నాలుగురోజుల పాటు జరిగిన ఈ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో ఆ పాల్గొన్నారు. శ్రీ గణపతి సచ్చిదానందస్వామి తన దత్తక్షేత్ర యాత్రలో భాగంగా ఇక్కడకు వచ్చి భక్తులకు తనదైన శైలిలో శ్రీకృష్ణ తత్వాన్ని వివరించారు. శ్రీ గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు పాల్గొన్నారు.

# క్యాన్సర్ నివారణపై సదస్సు



క్యాన్సర్ వ్యాధిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, మద్యపానం–ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ప్రముఖ వైద్యులు రమేష్‌బాబు, హరికాంత్ చెప్పారు. ఈనెల 4న నెల్లూరులోని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏసీ సుబ్బారెడ్డిస్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వారు క్యాన్సర్ వ్యాధి గురించి అవగాహన కలిగించారు. అసోసియేషన్ అధ్యక్షులు అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జికె గోపీనాథ్, గౌరవాధ్యక్షులు మేకల నరేంద్రరెడ్డి, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్ర షెట్టి, డివి సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, చంద్రమౌళి, గోపాల్‌రెడ్డి, కెఎంకె రెడ్డి, వెంకటరావు, ఖలీల్‌బేగ్, 203–ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వైవి రెడ్డి, చైతన్య, నీలాద్రి పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు



# సీపీఎం రాష్ట్ర మహాసభలు

ఉద్యమాల పురిటిగడ్డ సింహపురి సీమలో దాదాపు 47 ఏళ్ల తర్వాత తొలిసారిగా నెల్లూరులో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు అట్టహాసంగా జరిగాయి. ఎర్రజెండాల రెపరెపలతో నెల్లూరు నగర వీధులు ఎర్రబారాయి. జిల్లావ్యాప్తంగా వేలాదిమంది సీపీఎం నాయకులు, కార్యకర్తలు సభలకు తరలివచ్చారు. ప్రజానాట్యమండలి కళాకారుల విప్లవగీతాలతో అనిల్‌గార్డెన్స్‌వద్ద సభాప్రాంగణం మార్మోగిపోయింది. ఈ మూడురోజుల సభా కార్యక్రమాల్లో సీపీఎం కేంద్ర కమిటీ నాయకురాలు బృందాకారత్, సీపీఎం పొలిట్‌బ్యూరోసభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ బేబి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, ఆర్ అరుణ్‌కుమార్, ఎస్.పుణ్యవతితో పాటు సీపీఎం అగ్రనాయకులంతా పాల్గొన్నారు. సీనియర్ నాయకుడు పి.మధు సీపీఎం పతాకాన్ని ఆవిష్కరించి సభలను ప్రారంభించారు. కమ్యూనిస్టు యోధులు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య, జక్కా వెంకయ్య తదితరులకు పుట్టినిల్లయిన నెల్లూరుసీమలో సభలు జరుగుతుండడంతో రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది సీనియర్ నాయకులు పాల్గొని తమ సందేశాలనిచ్చారు. సుమారు 500 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయంటూ నాయకులు ధ్వజమెత్తారు. ముఖ్యంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలతో ప్రజలను అవస్తల పాలుచేస్తోందని దుయ్యబట్టారు. ప్రజల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. పేద ప్రజల కష్టాలు తీర్చేందుకు, ప్రజాహక్కులను పరిరక్షించేందుకు సిపిఎం కట్టుబడి ఉంటుందన్నారు. జిల్లా సీపీఎం నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, చంద్ర రాజగోపాల్ తదితరులు ఈ సభలను ఘనంగా నిర్వహించారు.



# డిప్యూటీ మేయర్‌గా తహసీన్

ఎట్టకేలకు నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా మంత్రి నారాయణ ఎంపికచేసిన మైనార్టీ నాయకురాలు, 48వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ తహసీన్ ఎన్నికయ్యారు. డిప్యూటి మేయర్‌గా మైనార్టీ నాయకురాలు ఎన్నిక కావడం నెల్లూరు కార్పొరేషన్ చరిత్రలో ఇదే తొలిసారి! ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశం మందిరంలో ఈనెల 1న ఏర్పాటుచేసిన సమావేశంలో, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా షేక్ కరీముల్లాను కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసయాదవ్, వేలూరు ఉమామహేష్ ప్రతిపాదించారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా 48వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ తహసీన్‌ను కార్పొరేటర్లు కరణం మంజుల, కర్తం ప్రతాప్‌రెడ్డి ప్రతిపాదించారు. ఇద్దరు అభ్యర్థులకు మద్దతుదారులు చేతులు ఎత్తి ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. కరీముల్లాకు 12 ఓట్లు రాగా, తహసీన్‌కు 41 ఓట్లు వచ్చాయి. దీంతో డిప్యూటీ మేయర్‌గా తహసీన్ ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. ఈ ఎన్నిక ప్రక్రియలో నెల్లూరురూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డితో పాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు. మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ తదితరులు తహసీన్‌ను అభినందించారు.

### నగరాభివృద్ధి కోసం పనిచేస్తా - తహసీన్

డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన సయ్యద్ తహసీన్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో తనకు ఈ అవకాశం కల్పించిన మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎన్డీఏ కూటమి నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో వుంటూ నెల్లూరు నగర అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని ఆమె చెప్పారు.

### వచ్చే ఎన్నికల్లో అన్ని డివిజన్లు గెలుస్తాం - శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో నెల్లూరులోని 54 డివిజన్లలో తమ అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌బాబుకు గిఫ్ట్‌గా అందిస్తామని చెప్పారు.

# జయజయ ధ్వానాలతో.. జగన్నాథ రథయాత్ర





'జై జగన్నాథ...జైజై జగన్నాథ' అంటూ జయజయధ్వానాలు చేస్తూ, పెద్దపెట్టున దైవ సంకీర్తనలతో, హరేరామ–హరేకృష్ణ నామోచ్చరణలతో, కోలాటాలు, నృత్యాల ఆనందకోలాహలంతో ఈనెల 1న నెల్లూరు నగర వీధుల్లో జరిగిన జగన్నాథ యాత్ర నగరప్రజలను బాగా ఆకట్టుకుంది. అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్యసంఘం (ఇస్కాన్) నెల్లూరుశాఖ అధ్యక్షులు, ఇస్కాన్ మందిరం నిర్వాహకులు శ్రీ శుకదేవస్వామి నేతృత్వంలో వేలాది మంది భక్తులు ఈ యాత్రలో పాల్గొన్నారు. దారిపొడవునా స్వామివార్లకు కర్పూర నీరాజనాలు సమర్పించారు. గత పన్నెండేళ్ళుగా ఈ యాత్ర ప్రతిఏటా జరుగుతూనే ఉంది. భగవన్నామం, భగవద్దర్శనం, భగవంతుని ప్రసాదం అన్నీ ఈ రథయాత్రలో లభిస్తుండడంతో భక్తులు, స్థానిక ప్రజలు, ప్రముఖులు పెద్దసంఖ్యలో ఈ యాత్రలో పాల్గొంటుండడం విశేషం. గతంలో యాత్రలకు భిన్నంగా, ఈసారి మూలాపేట లోని శ్రీ హనుమాన్ విగ్రహం వద్ద నుంచియాత్ర ప్రారంభమైంది. బారకాసు, పెద్దబజారు, చిన్నబజారు, ములుముడి బస్టాండ్ కూడళ్ళ మీదుగా సర్వోదయ కళాశాల మైదానికి చేరుకుంది. అక్కడ పెద్దఎత్తున జరిగిన సభలో అనేకమంది ప్రముఖులు పాల్గొని రథయాత్ర ప్రాముఖ్యతను వివరించారు. డా.వైష్ణవాంఘ్రి సేవక్‌దాస్ (నవీ ముంబై), ఇస్కాన్ ప్రముఖులు శ్రీ శ్రీనివాస శ్యామ్‌దాస్, ఇస్కాన్ అధ్యక్షుడు శ్రీ శుకదేవస్వామి తదితరులు మాట్లాడుతూ, లోకకల్యాణం కోసం, ఆ శ్రీకృష్ణభగవానుని కృపాకటాక్షాల కోసం సకలానందదాయకం, ముక్తి ప్రదాయకమైన జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. ఎంతో పుణ్యప్రదమైన 'హరేకృష్ణ–హరేరామ' తారకమంత్రాన్ని భక్తలోకంలో ప్రచారం చేయడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా శ్రీ శుకదేవస్వామి ఆధ్వర్యంలో రూపొందించిన 'సనాతన ధర్మం: మానవత్వము, దైవత్వానికి దారి, అందరికీ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం నిర్వహణకు, వేలాదిమంది భక్తులకు భోజనవసతికి ప్రముఖ దాత, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ప్రతిఏడాదిలాగానే ఈసారి కూడా 6 లక్షల రూపాయల విరాళాన్ని ఇచ్చారంటూ, వేమిరెడ్డి దంపతులకు వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ రథయాత్రలో స్థానిక సాయిదర్బార్ అద్దాలమందిరం వారు నిర్వహించిన కోలాటప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సుమారు 10వేల మంది భక్తులకు వేమిరెడ్డి వారి సహకారంతో, ఇస్కాన్‌మందిరం వారు అన్నప్రసాద వితరణ చేశారు.




## ఇస్లామిక్ శాంతి సభలకు..

# విపిఆర్ ఫౌండేషన్ 25 లక్షల సహాయం



ఇస్తిమా పేరిట జరిగే ఇస్లామిక్ శాంతి సభలకు విపిఆర్ పౌండేషన్ నుంచి వేమిరెడ్డి దంపతులు పాతిక లక్షల రూపాయల సాయం అందించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి కొడవలూరు మండలం చంద్రశేఖరపురం వద్ద రాష్ట్రస్థాయిలో తబ్లిగ్ జమాత్ నిర్వహించే ఇస్తిమా గ్రౌండ్‌ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు ఇటీవల సందర్శించారు. ఫిబ్రవరి 22, 23 తేదీలలో రెండు రోజుల పాటు జరిగే ఇస్తిమా సందర్భంగా ఆ ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి దాదాపు రెండు లక్షలమంది హాజరయ్యే ఇస్తిమాకు ప్రభుత్వపరంగా తాగు నీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రవాణా తదితర సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ వేమిరెడ్డి దంపతుల సహాయ సహకారాలకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి జాకీర్ షరీఫ్, మైనారిటీ నాయకులు నన్నే సాహెబ్, కొడవలూరు మండల టిడిపి నాయకులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమం-రాష్ట్రాభివృద్ధి.. చంద్రబాబుకే సాధ్యం!

**- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



ప్రజా సంక్షేమం-రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. బుచ్చి మండలం విలియమ్స్‌పేట గ్రామంలో ఆమె ఇటీవల సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి పెన్షన్లు అందచేశారు. వివిధ సమస్యలపై స్థానికులు ఇచ్చిన వినతి పత్రాలను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా సుపరిపాలన అందించే సామర్థ్యం ఒక్క చంద్రబాబునాయుడుకే ఉందన్నారు. దివ్యాంగులు సైతం మరొకరిపై ఆధారపడకుండా గౌరవప్రదమైన జీవితం గడిపేందుకు, గతంలో ఇస్తున్న మొత్తాన్ని రెట్టింపుచేసి 6 వేలు ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఖాళీ ఖజానా అప్పగించినా సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి అవాంతరాలు లేకుండా రాష్ట్రంలో ఐదేళ్లకు సరిపడా సంక్షేమం మరియు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి పునాదులు వేస్తున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ పల్లెలను ప్రగతి బాట పట్టిస్తుందన్నారు. సచివాలయ అధికారులతో సమన్వయం చేసుకొని గ్రామాలలో సమస్యలపై స్థానిక నాయకులు దృష్టి సారించాలని ఆమె కోరారు. ఏ సమస్య వున్నా నేరుగా తనను సంప్రదించాలని నియోజకవర్గ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ అద్దంకి వెంకటేశ్వర్లు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థుల ప్రతిభను గుర్తించాలి

**- డా. సతీష్‌రెడ్డి**



దేశవ్యాప్తంగా గ్రామీణప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిలోని ప్రతిభకు పదునుపెట్టి ఉన్నత లక్ష్యాలవైపు మళ్ళించాలని, ఆ బాధ్యత ఉపాధ్యాయుల దేనని ప్రముఖ శాస్త్రవేత్త, డిఆర్‌డీఓ మాజీ ఛైర్మెన్, కేంద్ర రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డా. గుండ్రా సతీష్‌రెడ్డి అన్నారు. ఇటీవల వింజమూరు వైఆర్ జూనియర్ కళాశాలలో ఏబిఆర్ఎస్ఎం అనుబంధ సంఘమైన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో జరిగిన టెన్త్ సిల్వర్‌జుబ్లీ మెగా టాలెంట్ టెస్ట్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేడు భారతదేశంలోని ప్రతిష్టాత్మకమైన అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోకు నేతృత్వం వహించిన ఎంతో మంది శాస్త్రవేత్తలు గ్రామీణ ప్రాంతాల నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని వచ్చిన వారేనన్నారు. తనతోపాటు, విఖ్యాత శాస్త్రవేత్తలు డాక్టర్ అబ్దుల్ కలాం, డాక్టర్ కస్తూరి రంగన్, డాక్టర్ నారాయణ, మొదలైన వారందరూ కూడా ఈ కోవకే చెందుతారని పేర్కొన్నారు.

గత పది సంవత్సరాలలో భారత దేశంలో విద్య, వైద్యం, గృహ, వ్యవసాయ, రక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో ప్రగతిని సాధించిందని, ముఖ్యంగా రక్షణ రంగంలో అవసరమైన పరికరాలను విదేశాల నుండి దిగుమతి చేసుకునే స్థాయి నుంచి నేడు ప్రపంచంలోని అనేక దేశాలకు ఎగుమతి చేసుకునే స్థాయికి చేరడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పదవ తరగతి మెగా టాలెంట్ టెస్ట్‌కు దాదాపు 500 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో మొదటి పది స్థానాలలో నిలిచిన విద్యార్థులకు డాక్టర్ సతీష్‌రెడ్డి, కాకర్ల సురేష్, మాజీ శాసనసభ్యుడు కంభం విజయరామిరెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. అనంతరం సతీష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఏబిఆర్ఎస్ఎమ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, డాక్టర్ మాసిలామణి, ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాలాజీ, రాష్ట్ర కార్యదర్శి వెంగయ్య, జిల్లా అధ్యక్షులు రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, వింజమూరు మండల ఆపస్ నాయకులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వరుని సేవలో...

# మంత్రులు ఆనం, అనగాని!

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలసి ఈనెల 1న తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వర స్వామివారికి, శ్రీ జ్ఞాన ప్రసూనాంబదేవి అమ్మవారికి వారు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా స్వాగతించారు. వేద పండితులు ఆశీర్వచనం అనంతరం, ఎంఎల్‌ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి తదితరులు స్వామివార్ల శేషవస్త్రంతో వారిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం, మంత్రులు ఉచిత అన్నదాన భోజనశాలకు వెళ్ళి అక్కడ భక్తులకు భోజనం వడ్డించారు. మహాశివరాత్రి పర్వదినం ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, అధికారులకు సూచనలిచ్చారు. వారివెంట జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఈఓ బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జపాన్ రాయబారితో..

# శ్రీసిటీ ఎం.డీ సమావేశం



జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకాహషి ఆహ్వానం మేరకు, భారత్‌లోని జపాన్ రాయబారి ఒనో కెయిచి గౌరవార్థం చెన్నైలో ఇటీవల నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పాల్గొన్నారు. గత నవంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఆయన తొలిసారిగా చెన్నై పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా రాయబారిని డా. సన్నారెడ్డి ఘనంగా సన్మానించారు. జపనీస్ సంస్థలకు భారతదేశంలో రెండవ అతిపెద్ద పెట్టుబడి గమ్యస్థానంగా ఆవిర్భవించిన శ్రీసిటీ గురించి ఆయనకు వివరించారు. అనేక జపనీస్ కంపెనీలకు నిలయంగా మారుతున్న శ్రీసిటీలోని సుస్థిర పర్యావరణ వ్యవస్థను ఆయన దృష్టికి తెచ్చారు. శ్రీసిటీ అభివృద్ధి, వ్యాపార అవకాశాలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చలు జరిపేందుకు రాయబారి ప్రత్యేక ఆసక్తిని కనబరిచారు. టోక్యోలో ఇటీవల ముగిసిన ఆటోమోటివ్ వరల్డ్ ఎక్స్‌పో 2025లో శ్రీసిటీ పాల్గొని, పారిశ్రామిక ప్రయోజనాల ప్రదర్శన మరియు ప్రపంచ పెట్టుబడిదారుల చర్చలతో తన ప్రాముఖ్యాన్ని చాటుకున్న తీరును డాక్టర్ సన్నారెడ్డి ఈ సందర్భంగా ఆయనకు వివరించారు. జపనీస్ తయారీదారులు తమ ప్రధాన వ్యాపార గమ్యస్థానంగా శ్రీసిటీని ఎంపిక చేసుకునేందుకు ఈ ఆటో ఎక్స్‌పో తమకు ఓ అద్భుత వేదికగా ఆయన పేర్కొన్నారు.



తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# వసంతలక్ష్మికి ఎమ్మెల్యే సత్కారం



గూడూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 3వ తేదీ యోగ-సమ కోణాసనంలో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన సిహెచ్ వసంత లక్ష్మిని, వారి కుటుంబ సభ్యులను గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ – సంధ్యారాణి దంపతులు, పెన్వర్ ప్రోడక్ట్ లిమిటెడ్ డైరెక్టర్ గంటా మధుకృష్ణ, గాయత్రిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వసంతలక్ష్మి యోగాలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించడం అభినందనీయమని, ఆమెను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, యోగా ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. ఆమెకు ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. టీడీపీ మహిళా నాయకురాలు మట్టం శ్రావణి, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, గుండాల భారతి, కోడిపర్తి కల్పన, దాసరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో టెనెక్టేప్లేస్ ఇంజక్షన్లు



గుండెపోటు వచ్చి సమయానికి చికిత్స అందక ఎంతో మంది చనిపోతున్నారని, అలాంటి వారికి గంటలోపు టెనెక్టేప్లేస్ ఇంజక్షన్ ఇస్తే ప్రాణాపాయం నుండి గట్టెక్క వచ్చని, ఈ ఉద్దేశ్యంతోనే కూటమి ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రిలో టెనెక్టేప్లేస్ ఇంజక్షన్లు అందుబాటులో ఉంచిందని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా ఈ నెల 3వ తేదీ పేర్కొన్నారు. గూడూరు ప్రజలు ఈ విషయాన్ని గమనించి, అత్యవసర పరిస్థితుల్లో ఏరియా ఆసుపత్రిలో ఈ ఇంజక్షన్‌ను పొందవచ్చని ఆమె తెలిపారు.



గూడూరు మాలవ్యానగర్‌లోని కాస్మోపాలిటిన్ క్లబ్‌లో ఈ నెల 5వ తేదీ జరిగిన ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గ సమావేశంలో మహాన్యూస్ డైరీని ఆవిష్కరిస్తున్న గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, పక్కన కనుమూరు హరిచంద్రారెడ్డి, ఎన్.భాస్కర్‌రెడ్డి, రహీం, పులిమి శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, షేక్ అల్తాఫ్, వెంకటేశ్వర్లు, రఘు, అన్వర్ తదితరులు.

# టీడీపీతోనే నాయీ బ్రాహ్మణులకు గుర్తింపు

## రుద్రకోట సదాశివమ్



దేశంలో ఎక్కడా లేని విధంగా దివంగత మాజీ సీఎం ఎన్టీ రామారావు నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ ఏర్పాటు చేశారని, అప్పటినుంచి ఇప్పటి సీఎం చంద్రబాబునాయుడు వరకు నాయీబ్రహ్మణులకు తెలుగుదేశం పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఇస్తున్నారని నాయీబ్రాహ్మణుల వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ రుద్రకోట సదాశివమ్ తెలిపారు. ఈ నెల 4వ తేదీ గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ నాయకులు శీలం కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, ఇస్రాయిల్ కుమార్, రహీమ్, శ్రీనివాస్‌యాదవ్, భాస్కర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రథ సప్తమి సందర్భంగా చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న పెంచలకోన శ్రీ లక్ష్మీనరసింహుడు

# అవినీతిని ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలి



అవినీతిని ప్రతి ఒక్కరూ ప్రశ్నించాలని అరవ పార్వతయ్య వెల్లడించారు. జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులుగా ఆయన ఎన్నికైన సందర్భంగా గూడూరు ప్రధాన పోస్ట్ ఆఫీస్ ఆవరణలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని, జిల్లాలో ఏ సమస్య ఉన్నా, తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం గూడూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, నెల్లూరుకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. డివిఎంసి మాజీ సభ్యులు దాసరి వెంకటేశ్వర్లు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి నెల్లూరుజిల్లా అధ్యక్షులు మేజూరు మాధవ్, నెల్లూరు జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు మదన్ మిశ్రా, పసల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.




9వ వర్ధంతి

నిష్కల్మష హృదయుడు, నిస్వార్థ సేవాతత్పరుడు,
నిరంతర ప్రజాసేవకుడు
చిట్టమూరు పద్మనాభరెడ్డి గారు
(మాజీ వైస్ ఛైర్మెన్, జిల్లా ప్రజాపరిషత్, నెల్లూరుజిల్లా)
పరమపదించి తేది. 9.2.2025 నాటికి తొమ్మిదేళ్ళు గడుస్తాయి.
వారి దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ...

బావమరిది / అల్లుడు - కుమార్తె
ప్రొ॥ సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై
కోడలు
డా॥ సి.భారతి, యు.యస్.ఏ
(W/o. లేట్. డా॥ సి.మధుసూదన్‌రెడ్డి)
మనుమరాలు, మనుమడు
ప్రణీత అరవింద్, లోహిత్, యు.యస్.ఏ
మనుమడు - మనుమరాలు
డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై
మనుమరాలు - మనుమడు
శ్రీమతి హారిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ
మునిమనుమలు మునిమనుమరాండ్రు
జయేష్ & అష్మిత      కీర్తన లక్ష్మి & తనవ్



## జానకిరామ.. రామాయణం 51

- ఊటుకూరు జానకి రామారావు



అరణ్యకాండం ప్రారంభం.

*ప్రవిశ్య తు మహారణ్యం దణ్డకారణ్యమాత్మవాన్।*
*దదర్శ రామో దుర్ధర్షస్తాపసాశ్ర మమండలమ్॥*

బుద్ధిమంతుడు, ఎవరూకూడ తేరిపారచూడసాధ్యం కాని వాడు, ఎదిరింపశక్యం కాని వాడు అయిన రాముడు దండకారణ్యంలో ప్రవేశించి మునుల ఆశ్రమ సముదాయాన్ని చూశాడు.

ఆ ముని వాటికలలో అన్ని మృగాలూ నిర్భయంగా సంచరిస్తున్నాయి. వాకిళ్ళు అన్నీ రంగవల్లులతో తీర్చిదిద్దబడి మనోహరంగా ఉన్నాయి.

ఆ ఆశ్రమం చుట్టూ మధురఫలాలనిచ్చే ఎన్నో వృక్షాలు దట్టంగా ఏపుగా పెరిగి చూడటానికి మనోహరంగా ఉన్నాయి.

ఆ ఆశ్రమంలో బలిహోమాలతో దేవతాపూజలు, వేదఘోషలతో ప్రాంగణమంతా మారుమ్రోగుతూ బ్రహ్మలోకాన్ని తలపిస్తోంది.

సూర్యుడితో సమానమైన తేజస్సుగల మహామునులంతా ఆ ఆశ్రమంలో నివసిస్తున్నారు.

వారందరినీ చూసి తన ధనస్సుకు ఉన్న నారి విప్పివేసి మెల్లగా వినయపూర్వకంగా వారున్న వైపుకు రాముడు వెళ్ళాడు.

సీతారామలక్ష్మణులను కాంచినంతనే మునులు ఎదురేగి స్వాగతం పలికారు.

వారందరికీ ఒకటే ఆశ్చర్యం అబ్బ! ఎంత నయనమనోహరంగా ఉన్నాడు రాఘవుడు.

మంచి శోభతోకూడిన శరీర సౌష్ఠవం, సౌకుమార్యం!!

అద్భుత రూపసౌందర్యం చూసి రెప్పవాల్చకుండా తదేకంగా వారినే చూస్తూ ఉండిపోయారు ఆ ముని గణమంతా!

సీతారామలక్ష్మణులకు ఆశ్రమప్రాంగణంలో ఒక పర్ణశాలలో బస ఏర్పాటు చేసి ఆయనను సత్కరించి వినయపూర్వకంగా వేడుకున్నారు... "రాఘవా, నీవే మాకు రాజువు, రక్షకుడవు. కావున సర్వదా తల్లి గర్భమును రక్షించినట్లు నీవు మమ్ములను రక్షించవలెను." అని పలికారు అందరూ.

వారి ఆతిథ్యం స్వీకరించి సూర్యోదయమైన వెంటనే మరల బయలుదేరాడు శ్రీ రాముడు.

అరణ్యమధ్యంలోకి ప్రవేశించారు.

అడవి ఈగలు రొదపెడుతున్నాయి, క్రూరమృగాలు గుంపులుగా తిరుగుతూ కనపడుతున్నాయి. ఆ ప్రదేశంలో ఉన్న లతలూ, వృక్షాలూ పాడుబడ్డట్టుగా కనిపిస్తున్నాయి. ఎక్కడా జలాశయమన్నదే కానరావడం లేదు. ఇంతలో ఎక్కడనుండో వస్తున్న భయంకరమైన అరుపులు పెడబొబ్బలతో అరణ్యమంతా మారుమ్రోగిపోతోంది.

వారి ఎదురుగా పర్వతకాయుడైన ఒక రాక్షసుడు వికృతంగా అరుస్తూ నిలబడి ఉన్నాడు.

ఎదురుగా నిలుచున్న పర్వతాకారుడైన రాక్షసుని పేరు విరాధుడు. అత్యంత జుగుప్సాకరమైన ఆకారం గలవాడు, ఏ అవయవమూ కూడా ఒకదానితో ఒకటి పొంతనలేకుండా అమరి ఉన్నది వాడి వికృతాకారము చూపరులకు భయం కలిగిస్తోంది.

ఒకపెద్ద శూలానికి మూడు సింహాలను, నాలుగు పెద్ద పులులను, పది చుక్కలజింకలను, పైన పసతో నిండిన దంతాలతో కూడిన ఏనుగు తలను గుచ్చి మోసుకుపోతున్నాడు.

సీతారామలక్ష్మణులను చూడగనే వారిని చంపటం కోసం వారి మీదకు దూసుకుంటూ వస్తున్నాడు.

వచ్చీ రావడంతోనే వాడు సీతను లాగి తన ఒడిలో కూర్చో పెట్టుకుని అందమైన ఈమెను నా భార్యను చేసుకొని మీ ఇద్దరినీ ఆహారంగా చేసుకుంటాను, బాగా కండబట్టి ఉన్నారు మీ ఇద్దరూ అంటూ వికృతంగా వికటాట్టహాసం చేస్తుంటే పెనుగాలికి ఊగే చివురుటాకులా గజగజవణికి పోతోంది సీతమ్మ.

వాడి ఒడిలో సీతమ్మ స్థితి చూసిన రాముడికి దుఃఖమాగటం లేదు. లక్ష్మణా అదిగో చూడు... సుకుమారి, అల్లారుముద్దుగా పెరిగిన నా సీత ఎలా పరాయిమగాడి ఒడిలోకి నెట్టబడ్డదో చూశావా!

కైక కళ్ళు చల్లబడ్డాయి ఇప్పటికి! అయ్యో నాకెందుకు ఇంత దుఃఖము సంప్రాప్తించింది! నా రాజ్యం నాకు కాకుండా పోయింది, నా తండ్రి మరణించాడు, నా భార్యను పరపురుషుడు తాకాడు.

రాముడి దీనాలాపాలు వింటున్న లక్ష్మణుడు ఒక్కసారిగా మహాసర్పం(పాము)లాగ బుసలుకొట్టాడు.

రామా! దేవేంద్ర సమాన పరాక్రమం గల నీవు చింతించడమా? నేను నీ దాసుడను. ఇదిగో ఇప్పుడే నేను ప్రయోగించే బాణం విరాధుడి రక్తంతో భూమికి గల దాహం తీర్చగలదు..

వీరి సంభాషణ వింటున్న విరాధుడు 'ఎవరురా మీరిద్దరూ ఆడుదానిని వెంట పెట్టుకొని ముని వేషాలతో అడవులలో సంచరిస్తున్నారు.' అని అడిగాడు. అప్పుడు తామెవరో రాముడు తెలియచేసి, మరి నీవెవరు అని అడిగాడు.

అప్పుడు వాడు, నేను జవుడు, శతహ్రదలకు పుట్టినవాడను.

ఎవ్వరిచేత ఛేదించబడకుండా, చంపబడకుండా బ్రహ్మ వద్ద నుండి వరాలు పొందాను. మీరు నన్నేమి చేయలేరు. ఈ ఆడదానిని నాకు వదిలేసి వచ్చిన దారినే త్వరగా పారిపోండి, నేనేమీ చేయను మిమ్మల్ని అని పలికాడు.

వాడి మాటలకు ఒక్కసారిగా రాముడి కన్నులు ఎర్రగా అయిపోయాయి. ధనస్సును ఎక్కుపెట్టి బంగారుపొన్నులు గల ఏడు బాణాలను ఒక్కసారే సంధించి మహావేగంగా వదిలి పెట్టాడు, అవి రయ్యిన దూసుకుంటూ వెళ్ళి వాడి శరీరాన్ని చీల్చి అవతలపడ్డాయి. బుస్సుమంటూ రక్తం పొంగి వాడి శరీరం నుండి కారసాగింది.

ఆ బాధకు వాడికి కోపం వచ్చి, సీతాదేవిని దింపి శూలాన్ని ఎత్తి రామలక్ష్మణులవైపు పరుగెత్తాడు. వాడి మీదకు అన్నదమ్ములిరువురూ ఏకధాటిగా బాణవర్షం కురిపించినా వాడు లెక్క చేయక వారిరువురునీ చెరొక చేతిలో ఒడిసిపట్టుకుని తన భుజములకెక్కించుకొని అరణ్యంలో పరుగెత్తసాగాడు. అది చూసి బిగ్గరగా ఏడుస్తూ సీతమ్మ కూడా వాడివెంట పరుగెత్తింది.

పరుగెత్తుకుంటూ ఏడుస్తూ తమను అనుసరిస్తున్న సీతాదేవిని చూడగనే రాముడి హృదయంలో అగ్నిపర్వతం బ్రద్దలయినప్పుడు ప్రవహించే విధంగా క్రోధం కట్టలు తెంచుకొని ప్రవహించింది.

రామలక్ష్మణులు ఇరువురూ ఒకరికొకరు చెప్పుకుని వారు కూర్చుని ఉన్న రాక్షసుడి భుజాలను ఒక్కవేటుతో ఒకేసారి తెగనరికారు. ఆ దెబ్బకు ఆ రాక్షసుడు నేలపై కూలబడ్డాడు.

నేలపై పడ్డవాడిని కత్తులతో పొడిచి, ఖడ్గాలతో నరుకుతున్నా వాడు చావడంలేదు.

అప్పుడు బ్రహ్మ వరప్రసాది అయిన వాడిని చంపడం తమవల్లకాదని గ్రహించి, తమ్ముడూ వీడిని మరల లేవకుండా భూస్థాపితం చేద్దాం! నీవు వెంటనే వీడికి సరిపడా పెద్ద గొయ్యి తవ్వు అని చెప్పి, తాను వాడి కంఠం మీద కాలుపెట్టి వాడు లేవకుండా అణచిపట్టి ఉంచాడు.

శ్రీ రామచంద్రుడి చేతిలో చావుదెబ్బలు తిన్నవాడికి అప్పటికి గాని స్పృహ వచ్చి, రామా! మహానుభావా నీవెవరో తెలుసుకొనలేక అజ్ఞానంతో ప్రవర్తించాను. ఓ కౌసల్యానందనా నిన్ను, లక్ష్మణుని, సీతామాతను గుర్తించాను. కుబేర శాపం వలన నాకీ రూపం వచ్చింది.

ఎప్పుడైతే రాముడి చేతిలో చంపబడతావో నీ నిజరూపం నీకు వస్తుందని చెప్పాడాయన. స్వామీ నా కళేబరాన్ని పాతి పెట్టండి అని పలికి నిజరూపాన్ని ధరించి, ఓ రామా ఇటనుండి ఒకటిన్నర యోజనాల దూరంలో శరభంగ మహర్షి ఆశ్రమం ఉంది, అక్కడికి వెళ్ళండి మీకు శుభం కలుగుతుంది అని చెప్పి అంతర్ధానమయ్యాడు.

విరాధుడి భయం నుండి ఇంకా తేరుకోని సీతాదేవిని ఊరడిల్లచేసి, తమ్ముడు లక్ష్మణునితో ఇది చాలా దుర్గమారణ్యం లాగ ఉంది, మనం వెంటనే విరాధుడు చెప్పినట్లుగా శరభంగ మహాముని ఆశ్రమానికి వెళ్ళి ఆయనను మనకు వాసయోగ్యమైన ప్రదేశం గురించి అడిగి తెలుసుకోవాలి అని పలికి, ముని ఆశ్రమం వైపుగా నడక సాగించారు.

ముందు లక్ష్మణుడు, ఆవెనుక సీతమ్మ, వారిరువురినీ అనుసరిస్తూ రామయ్య ప్రయాణం సాగించారు.

వారికి అల్లంత దూరంలో శరభంగుడి ఆశ్రమం కనపడుతూ ఉంది.

.. (సశేషం)

# పంథా మారిన బడ్జెట్

## మనసులో మాట 31

మోదీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు తొలిసారిగా బడ్జెట్ పంథాను మార్చింది. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలిస్తేనే ఆర్థికవ్యవస్థ గాడిన పడుతుందనే కోణంలో మాత్రమే ఆలోచించిన ప్రభుత్వం ఈసారి ప్రజల కోణంలో, ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలు, ఉద్యోగుల కోణంలో ఆలోచించింది. వారి ఆకాంక్షలను నెరవేర్చే ప్రయత్నం చేసింది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ 2025-26 బడ్జెట్‌ను భిన్నమైన దృక్పథంతో ప్రవేశపెట్టారు.

ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దడానికి 2014 నుంచి, ముఖ్యంగా 2019 తర్వాత, ప్రభుత్వం ప్రైవేట్ రంగం ఆధారిత వృద్ధిపై దృష్టిపెట్టింది. ఆర్థిక వ్యవస్థలో తన పాత్రను తగ్గించుకోవడం ద్వారా, కార్పొరేట్ రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించాలనే వ్యూహాన్ని అనుసరించింది. అదే సమయంలో మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడి పెట్టింది. ప్రభుత్వరంగ సంస్థలను విక్రయించడానికి ప్రయత్నించింది. కార్పొరేట్ పన్నును తగ్గించింది. కార్పొరేట్ పన్ను అంటే కంపెనీలకు వచ్చే ఆదాయంపై పన్ను. ఈ పన్ను తగ్గిస్తే కంపెనీలు మిగుల్చుకునే ఆదాయంతో కొత్త పెట్టుబడులు పెడతాయని, ఫలితంగా మరిన్ని ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం భావించింది. ప్రభుత్వ పెట్టుబడుల వ్యయాన్ని కూడా భారీగా పెంచింది. అయినా ఆర్థికవ్యవస్థ గాడిన పడలేదు. దీంతో ఈసారి బడ్జెట్ వ్యూహాన్ని ప్రభుత్వం మార్చింది. ఉద్యోగుల ఆదాయపు పన్నును గణనీయంగా తగ్గించింది. ఏడాదికి రూ. 12.75లక్షల ఆదాయం వరకు ఉద్యోగులు పన్ను కట్టాల్సిన పనిలేదు. ప్రజల వద్ద ఎక్కువ డబ్బు ఉన్నప్పుడు, వారు ఎక్కువ ఖర్చు చేస్తారు. ఇది జీడీపీని పెంచుతుంది. ప్రజల వద్ద డబ్బు అందుబాటులో ఉంటే వారిలో ఖర్చుపెట్టే సామర్థ్యం పెరుగుతుంది. వస్తువులకు, సౌకర్యాలకు డిమాండ్ పెరుగుతుంది. ఫలితంగా డబ్బు ఆర్థిక వ్యవస్థలోకి రావడంతో పాటు, వారికందివ్వాల్సిన వస్తువులు, సేవలకు అనుగుణంగా ఉద్యోగాల కల్పన పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తార్కికంగా ఆలోచించినప్పుడు ఇది కొంతవరకు సబబుగానే తోస్తుంది. పన్నుల తగ్గింపు రూపేణా మిగిలిన ఆదాయంలో కొంత ఖర్చుచేసి మరికొంత పొదుపు చేసినా బ్యాంకుల్లో నగదు లభ్యత పెరిగి వడ్డీరేట్లు తగ్గే అవకాశం ఉంటుందని, ఇది కూడా ఆర్థిక వ్యవస్థకు మేలుచేసే అంశమేనని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

మరోవైపు సంక్షేమపథకాలకు కేటాయింపులు పెంచడం ద్వారా దిగువ మధ్యతరగతి, పేద వర్గాల వినియోగ సామర్థ్యాన్ని కూడా ప్రభుత్వం పెంచింది. పన్నుల్లో ఉపశమనం, సంక్షేమ పథకాల ద్వారా స్వల్పకాలంలో వినియోగసామర్థ్యాన్ని పెంచడంతో పాటు ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధిపైనా బడ్జెట్ దృష్టిపెట్టింది. ఫలితంగా ధీర్ఘకాలిక ప్రయోజనాలు సిద్ధిస్తాయని, శాశ్వత ఆదాయవనరులు ఏర్పడతాయని, వినియోగ సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థ పటిష్టమవుతుందని, ఈ ద్విముఖ వ్యూహంతో ఆర్థిక వ్యవస్థలో సమతౌల్యం వస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

భారత్‌లో ప్రస్తుత కార్మిక శక్తి భాగస్వామ్యం 55.4శాతమే. చైనాలో ఇది 75.9శాతంగా ఉంది. వియత్నాంలో 78.4శాతంగా ఉంది. మన కార్మికశక్తిలో 65.3శాతం మందికే వృత్తిశిక్షణ అందుతోంది. నిరంతరం నైపుణ్యశిక్షణపై దృష్టి సారించడం ద్వారా ఎక్కువమందికి ఉద్యోగ కల్పన సాధ్యమవుతుంది. కార్మికశక్తి భాగస్వామ్యం పెరగడం వల్ల ఉత్పత్తి, ఉత్పాదకత పెరిగి ఆర్థికవ్యవస్థ పటిష్టమవుతుంది. ఈ బడ్జెట్ నైపుణ్యశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం మంచి నిర్ణయం. ఉద్యోగ కల్పన, నైపుణ్యశిక్షణకు సవరించిన అంచనాలు రూ. 6,799 కోట్లు కాగా ఈ కేటాయింపులు 2026 బడ్జెట్ అంచనాల్లో రూ. 20వేల కోట్లకు పెంచడం మంచి విషయం.

మరోవైపు భారత ఆర్థిక వ్యవస్థలో కీలకమైన వ్యవసాయ రంగాన్ని పటిష్టపరిచే చర్యలనూ ఈ బడ్జెట్లో ప్రతిపాదించారు. అన్నీ ఆశించిన విధంగా జరిగితే రైతుల ఆదాయంలో పెరుగుదల కనిపించి వారిలోనూ కొనుగోలు శక్తి పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయ పరంగా ఉత్పాదకత తక్కువగా ఉంటున్న 100 జిల్లాల్లో సుస్థిర వ్యవసాయ పద్ధతులను, పంటల వైవిధ్యాన్ని, సాగునీటి వసతులను, రుణ సదుపాయాలను పెంచడం ద్వారా ఉత్పాదకత పెంచే లక్ష్యంతో ప్రధాన మంత్రి ధన-ధాన్య కృషి యోజనను ప్రారంభించనున్నట్లు బడ్జెట్లో పేర్కొన్నారు. ఫలితంగా 1.7 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ఇంకా వ్యవసాయ రంగంలో పలు పథకాలకు కేటాయింపులు పెంచడం సంతోషకరం.

ఆదాయపు పన్ను తగ్గింపు, మార్కెట్లో డిమాండ్ పెంచడానికి సరైన దిశలో వేసిన ఒక అడుగు మాత్రమే. కానీ ఇది చాలదు. లక్షల సంఖ్యలో ఉద్యోగ సృష్టి అవసరం. ఆదాయ వృద్ధికి ఉన్న ఇతర మార్గాలను అన్వేషించాలి. ముఖ్యంగా దిగుమతులు తగ్గించుకుని, ఎగుమతుల సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలను కల్పించవచ్చు. ఇందుకు దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం.


ముఖ్యంగా పాఠశాల స్థాయి నుంచి విద్యారంగాన్ని పటిష్టపర్చడం, పరిశోధన- అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవడం, అందుకు అనుగుణంగా ఈ రంగాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం కూడా చాలా అవసరం.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# బలి కోరుతున్న భక్తి

(మొదటిపేజీ తరువాయి)



## ప్రణాళికా లోపం.. భక్తులకు శాపం..!

ఆధ్యాత్మికంగా ప్రత్యేకమైన రోజుల్లో దేవాలయాలైనా.. నదీ తీరాలైనా జనంతో నిండిపోవడం సహజం. అయితే ప్రభుత్వాలు, అధికారులు, నిర్వాహకులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టడం వల్ల చాలా సందర్భాల్లో అనుకోని దుర్ఘటనలు జరిగి అమాయక భక్తుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఫలితంగా వారి కుటుంబాల్లో కల్లోలం నెలకొంటోంది. తొక్కిసలాట జరిగి ప్రాణాలు కోల్పోయిన తర్వాత పరిహారం ప్రకటించడమో.. క్షమాపణలు చెప్పడమో, విచారణ కమిటీలు వేయడమో ప్రభుత్వాలకు పరిపాటిగా మారింది. నిజానికి దేవుడిపై నమ్మకంతో ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసలకు ఓర్చి వచ్చే వారికి ఎలాంటి కష్టం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు విస్మరించడమే ఇలాంటి అనర్థాలకు కారణమవుతున్నాయి.

అధికారులు, సిబ్బంది కూడా ఉత్సవం ఎంత పెద్దది, ఎంతమంది వస్తారు, ఏ స్థాయిలో ఏర్పాట్లు చేయాలి, ఏఏ సౌకర్యాలు కల్పించాలి, ఎందరిని భద్రత కోసం వినియోగించాలి. పరిస్థితి చేయి దాటితే ప్లాన్ బీ ఏంటి..? దాన్ని ఎలా అమలు చేయాలనే అంశంపై స్పష్టత లేకుండా ఉండడం వల్లే తరచూ ఘోర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అదే సమయంలో ఎన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నా కొందరి సిబ్బంది నిర్లక్ష్యం, సమయానుకూలంగా సమస్యలను పరిష్కరించే నేర్పు లేకపోవడం, విపత్కర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలో తెలియని అయోమయం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఫలితంగా భక్తితో దేవుడి చెంతకు వెళ్లి చివరికి దేవుడి దగ్గరికే చేరిపోతున్నారని బాధిత కుటుంబసభ్యులు వాపోతున్నారు.

## మూఢభక్తికి తోడు.. ముందుచూపు లేక..

ఇక కొందరు భక్తులు సైతం మూఢభక్తితో, సంప్రదాయం పేరుతో ఆధ్యాత్మిక వేడుకల్లో ఉండే రద్దీని, క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకోకుండా మొండిగా ముందుకెళ్లడం వల్ల కూడా ప్రమాదాలకు, తొక్కిసలాటకు కారణమవుతోంది. పవిత్ర క్షేత్రాలకు వెళ్లే సందర్భాల్లో తమ ఆరోగ్య పరిస్థితి, వయస్సు, అక్కడి వాతావరణంపై భక్తులు అవగాహన కలిగి ఉండడం ఎంతైనా ముఖ్యం. అవేమీ పట్టించుకోకుండా అందరూ వెళ్తున్నారు కదా.. వెళ్తే మనకూ పుణ్యం వస్తుంది అనే భావనతో ఉంటే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లే. ఇక అనూహ్యంగా తొక్కిసలాట జరిగితే కుటుంబ సభ్యులను మళ్లీ ఎలా, ఎక్కడ కలుసుకోవాలి, ఎలా సమన్వయం చేసుకోవాలో ముందుగానే చర్చించుకోవాలి. అప్పుడే విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు నష్ట నివారణను తగ్గించుకునేందుకు, అందులో నుంచి బయటపడేందుకు అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

## కనువిప్పు కలిగేదెప్పుడో..?

గతంలో గోదావరి పుష్కరాల్లో ముప్పైకి మందికిపైగా మరణించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అలాగే జమ్మూలోని వైష్ణోదేవి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్లి 12మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా టోకెన్లు తీసుకునేందుకు భక్తులు ఒక్కసారిగా ముందుకు రావడం వల్ల ఒకరిపైఒకరు పడి ఆరుగురు అసువులు బాశారు. తాజాగా గంగ, యమున, సర్వసతి సంగమ స్థానమైన ప్రయాగ్‌రాజ్‌లోనూ కుంభమేళా సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకుని 30 మంది మరణించడం, మరో 60 మంది గాయపడడం తీవ్ర విషాదం నింపింది. పాలకులు, అధికారులు ఈ విషయంలో పశ్చాత్తపం వ్యక్తం చేస్తున్నా చేతులుకాలాక ఆకులు పట్టుకుంటే ఏ ప్రయోజనం అనే ప్రశ్న వినిపిస్తోంది. ఇక కుంభమేళాలో స్నానం చేస్తే మరు జన్మ ఉండదని, పాపాలన్నీ పోతాయని భక్తులు భావించడం సహజం. అలా అని లక్షలాదిమంది పాల్గొనే కార్యక్రమంలో ఎలాంటి అవగాహన లేకుండా వెళ్తే మరుజన్మ ఏమోగానీ ఈ జన్మను కాపాడుకోవడం కష్టమనే విషయాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలి.

అలాగే అధికారులు కూడా వేడుకల్లో పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ముందే భక్తులకు స్పష్టంగా తెలియజేయాలి, అనూహ్యంగా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడినప్పుడు ఎలా బయటపడాలో, అత్యవసర ద్వారాలు ఎక్కడెక్కడ ఉన్నాయో అవగాహన కల్పించాలి. అప్పుడే ఆశతో.. ఆత్మతృతతో.. చేసే ఆధ్యాత్మిక ప్రయాణం ఫలవంతమౌతుంది. లేకుంటే తోపులాటలు.. తొక్కిసలాటలతో ప్రాణాలనే హరిస్తుందన్నది కాదనలేని నిజం.

# వీనులవిందు చేసిన.. రామాయణ ప్రవచనాలు

నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి వారి మందిరంలో పద్యసారస్వత పరిషత్ నెల్లూరుశాఖ వారి ఆధ్వర్యంలో జనవరి 24 నుండి 31వ తేదీ వరకు రామాయణ ప్రవచనాలు వైభవంగా జరిగాయి. 24వ తేదీ విద్వాన్ కోట రాజశేఖర్ శ్రీరామచంద్రుడి గుణగణాలను వివరించగా, 25న విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు విశ్వామిత్రమహర్షి బ్రహ్మర్షి అయిన విశేషాలను, 26న డాక్టర్ గిరిజాలక్ష్మి వాలిసుగ్రీవుల అనుబంధాన్ని తెలియజేశారు. 27న పోలవరపు లక్ష్మీనరసింహారావు రామాయణంలోని స్త్రీపాత్రలను సీతాదేవి సౌశీల్యాన్ని తెలుపగా, 28న డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు హనుమంతుని మూర్తిమత్వాన్ని విశ్లేషించారు. 29న శతావధాని కొండెపి మురళీకృష్ణ రావణాసురుని వ్యక్తిత్వాన్ని, 30న డాక్టర్ ఐనవోలు చక్రపాణి వాల్మీకి మహర్షి వైశిష్ట్యాన్ని విశదీకరించారు. 31న డాక్టర్ సింగరాజు శ్రీ రామకృష్ణప్రసాదరావు దశరథమహారాజు చరిత్రను అద్భుతంగా వివరించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రముఖులు నలుబోలు బలరామయ్యనాయుడు, పాముల మల్లికార్జున, ఓగిరాల శారదాంబ, రమాదేవి గోవిందాచార్య దంపతులు, అన్నవరపు సత్యనారాయణ, ఇనమనమెళ్ళూరు నాగరాజారావు, భట్టారం సుబ్బుశ్రీనివాస్ మాధవి, చక్కిరాల జయప్రసాద్ తదితరులు సభా పోషకులుగా సహకరించారు. పోలవరపు లక్ష్మీనరసింహారావు అధ్యక్షతన, డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు పర్యవేక్షణలో సభలు వీనులవిందుగా కొనసాగి అందరినీ ఆకట్టుకున్నాయి.

# కోళ్ళపెంపకానికి సహకారం అందిస్తాం

జిల్లాలో కోళ్ళ పెంపకానికి ప్రభుత్వం తరపున తమశాఖ ద్వారా సహకారం అందిస్తామని జిల్లా పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.రమేష్‌నాయక్ చెప్పారు. నెల్లూరు టౌన్‌హాలులో ఈనెల 1న సీఇడి (సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రిన్యూర్ షిప్ డెవలప్‌మెంట్) వారి ఆధ్వర్యంలో నాటుకోళ్ళు, బ్రాయిలర్ కోళ్ళ పెంపకంపై ఉచిత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగులు ఉపాధి కోసం కోళ్ళ ఫారాలను ఏర్పాటు చేసుకొని వ్యాపారవేత్తలుగా ఎదగవచ్చన్నారు. డా.బీఎస్ జయచంద్రారెడ్డి కోళ్ళ పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను పెంపకందారులకు తెలియజేశారు. సీఇడి డైరెక్టర్ బి.వెంకట్, యూనియన్ బ్యాంక్ ప్రతినిధి కె.మురళీకృష్ణ, మెప్మా ప్రతినిధి అంకయ్య, ఐబీఓ శ్రీనివాస్ కోళ్ళ పెంపకందార్లకు ఇస్తున్న బ్యాంకు రుణాలు, రాయితీలను వివరించారు.

# ఈసారి జగన్ 2.0ని చూస్తారు

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ రంగానికైతే ఇది తప్పనిసరిగా వర్తిస్తుంది. నాయకులు తమకు వచ్చిన అవకాశాలను జారవిడుచుకుంటే.. సమర్థులైన సహచరుల ప్రతిభను గుర్తించకుంటే.. భవిష్యత్‌కు ఏది మంచిదో.. ఏది చెడ్డదో తెలుసుకోకుంటే విజయలక్ష్మిని చేరుకోవడం అంత సులభం కాదు. అదే సందర్భంలో అసమర్థులను పక్కనపెట్టుకున్నా.. శకుని లాంటి వారిని చేరదీసి నెత్తిన పెట్టుకున్నా కంటికి కనిపించకుండానే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇదే ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో జరుగుతోందని రాజకీయ విశ్లేషకులే కాదు పార్టీశ్రేణులు కూడా భావిస్తున్నారు.

## కోటరీయే విషవలయం!

నిజానికి వైఎస్సార్‌సీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (మొన్నటి వరకు విజయసాయిరెడ్డి కూడా) తదితరులతో కూడిన కోటరీయే విషవలయం అనే భావన రాజకీయ విశ్లేషకుల్లో వినిపిస్తోంది. ఈ కోటరీ గత ఐదేళ్ల కాలంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పార్టీ పటిష్టతని అటకెక్కించి, కేవలం జగన్ ప్రాపకం కోసం మాత్రమే పాకులాడిందనే వాదనలున్నాయి. ఇక రాష్ట్రంలోని వాస్తవ, క్షేత్రస్థాయి విషయాలను అధినేతకు తెలియనీయకుండా కోటరీలోని నాయకులు భ్రమలు కల్పించారనే విమర్శలున్నాయి. గాల్లో లెక్కలు కడుతూ జగన్ కళ్లకు గంతలు కట్టారని ఆ పార్టీ కార్యకర్తలే వాపోతున్నారు. ఫేక్ సర్వేలు, నాయకులపై పితారీలు, ఫిర్యాదులకే పరిమితమై ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పుట్టి మునగడానికి కారణమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక అధినేతకు ఏ విషయంలోనూ అసలు పాయింట్ చెప్పనివ్వలేదని.. అపాయింట్‌మెంట్ దక్కనివ్వలేదని మండిపడుతున్నారు. మొత్తంగా పార్టీని కోటరీ నాయకులకు అప్పగించడం వల్లే జగన్‌మోహన్‌రెడ్డి 11 సీట్లకు పడిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి ప్రతిపక్ష హోదా దక్కకున్నా జగన్ ఇప్పటికీ కళ్లు తెరవడం లేదని వాపోతున్నారు.

## మళ్లీ మళ్లీ అదేతప్పు!

కోటరీ నాయకులను నమ్మి గత ఎన్నికల్లో జగన్ అనేక తప్పులు చేశారు. ప్రజలు, కార్యకర్తల అభిప్రాయాలకంటే కోటరీకే ప్రాధాన్యత ఇచ్చారు. కోటరీ చెప్పింది కదా అని.. ఎవరిని తీసేయమంటే వారిని తీసేశారు. ఎవరిని మార్చేయమంటే వారిని మార్చేశారు. ఎవరికి టికెట్ ఇవ్వమంటే వారికి ఇచ్చేశారు. చివరికి ఘోర ఓటమిని మూటకట్టుకున్నారు. అయినా తీరు మార్చుకోకుండా వారినే ప్రధాన కార్యదర్శులు, కో-ఆర్డినేటర్లంటూ కీలక పదవుల్లో కొనసాగిస్తున్నారు. వీరిలో ప్రధానంగా విజయసాయిరెడ్డి.. ఉత్తరాంధ్రలో పార్టీని భ్రష్టు పట్టించి చివరికి నెల్లూరులో తేలి.. ఎన్నికల్లో చావుదెబ్బ తిన్నారు. అయినా ఆయన్ని ఉత్తరాంధ్ర రీజనల్ ఇన్‌చార్జిగా నియమించడంతో శ్రేణులు విస్తుపోయాయి. తాజాగా ఆయన ఆ రాజకీయ సన్యాసం తీసుకోవడంతో కొత్త ఇన్‌చార్జి నియామకంపై ప్రస్తుతం తర్జన భర్జన పడుతున్నట్లు సమాచారం. అలాగే ప్రభుత్వంలో ఉన్నప్పుడు సకలశాఖ మంత్రిగా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డిని ఇప్పటికీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హోదాలో కొనసాగిస్తూ.. అన్ని వ్యవహారాలనూ చక్కబెట్టే బాధ్యతలను కట్టబెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఇక పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా పార్టీలో గ్రూపులకు కారణమయ్యారనే వాదనలున్నాయి. వీరిని పార్టీ కార్యక్రమాలకు దూరం పెడితే కానీ పరిస్థితులు గాడిలో పడవని పలువురు నాయకులు తేల్చి చెప్తున్నారు. అయితే ఈ విషయాన్ని అధినేతకు నేరుగా చెప్పలేక పార్టీ భవిష్యత్‌పై వారంతా లోలోన మదనపడుతున్నట్లు సమాచారం.

## ప్రకటనలు మానాలి.. ప్రజల్లోకి రావాలి!

2019లో ఎన్నికలకు ముందు ప్రజాసంకల్ప యాత్ర పేరుతో రాష్ట్రాన్ని చుట్టేసిన జగన్.. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు పూర్తిగా దూరమయ్యారు. పార్టీ గెలుపెప్పుడూ జనం నమ్మకాన్ని గెలుచుకోవడంలోనే ఉంటుందన్న నిజాన్ని పూర్తిగా విస్మరించారు. ముఖ్యమంత్రిగా పరదాల మాటున పర్యటనలు చేసి ప్రజలతో మమేకమవ్వడమే మానేశారు. రాజకీయ పార్టీ అంటే నిత్యం ప్రజలతో ఉండాలనే విషయాన్నే మరిచిపోయారు. నాయకులు ప్రజల్లోనే పుడతారు, ప్రజల్లోనే ఎదుగుతారు... అలాంటి ప్రజలకు దూరమైతే భవిష్యత్ శూన్యమనే విషయాన్ని గ్రహించలేకపోయారు. ఈనేపథ్యంలో ఇప్పటికీ నాలుగు గోడల మధ్య, నలుగురితో కూడిన కోటరీ మధ్యే ఉంటే ప్రజానుగ్రహం ఎప్పటికీ దక్కదనే విషయాన్ని జగన్ తెలుసుకోవాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సంక్రాంతి తర్వాత క్షేత్రస్థాయి పోరాటాలతో కూటమి ప్రభుత్వ తీరును ఎండగడతామని గతంలో ప్రకటించిన జగన్.. తర్వాత చూద్దాం అంటూ మిన్నకుండిపోవడమే దీనికి ఉదాహరణగా పేర్కొంటున్నారు.

## ఫీజుపోరుపై తర్జనభర్జన!

ఇక తాజాగా ఫీజు పోరుకు సంబంధించిన కార్యాచరణలోనూ కోటరీలోని నాయకులే కీలకంగా వ్యవహిస్తున్నారనే వాదన ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 5వ తేదీన నిర్వహించాల్సిన ఫీజు పోరు ఈనెల 12కు వాయిదా వేసుకున్నట్లు ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. అయితే జగన్ కంటే కోటరీ నాయకుల డైరెక్షన్ ఎక్కువగా ఉండడంతో కిందిస్థాయి నాయకులు ఈ ఆందోళనల్లో భాగమయ్యేందుకు అంతగా ఆసక్తి చూపించడం లేదని తెలిసింది. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం కూడా ఓ అనూహ్య నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ మేరకు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను 12వ తేదీలోపే విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఆ విషయమై విద్యాశాఖ మంత్రి తరచూ ప్రకటనలు కూడా చేస్తున్నారు. అదే జరిగితే ఫీజు పోరుపై ఏం చేయాలనే విషయంపై వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం డైలమాలో పడినట్లు కూడా సమాచారం.

## అధినేత మారితేనే.. మనుగడ!

ఇక పార్టీలో ఇప్పటికైనా విష నాగుల్లాంటి కోటరీలోని నాయకులను జగన్ దూరం పెట్టి.. ప్రజలతో సత్సంబంధాలు నెరిపి వారి ఆకాంక్షలు, కోరికలు తెలుసుకోవాలి. ప్రజలు బాధల్లో ఉన్నప్పుడు వారి పక్షాన ముందు నిలిచి అండగా ఉంటేనే పునర్ వైభవం దక్కుతుందని గ్రహించాలి. వ్యక్తిగత స్వార్థం కంటే పార్టీ ప్రయోజనాల కోసం శ్రమించే వారిని గుర్తించి ప్రోత్సహించాలి, దూరమైన శ్రేయోభిలాషులు, స్నేహితుల అభిమానాన్ని తిరిగి దక్కించుకోవాలి. లేకుంటే ఎప్పటిలాగే రిక్తహస్తాలు తప్ప మరేమీ మిగలవు. ఆ దిశగా జగన్ ఆలోచనా ధోరణిలో మార్పులొచ్చి సృజనాత్మకతతో ముందుకెళ్తారో లేక భజనపరులను నమ్మి మరింత పాతాళానికి పడిపోతారో కాలమే నిర్ణయించనుంది. ఏది ఏమైనా కోటరీని దూరం పెట్టి ఆయన కోటని విడిచి పెడితే తప్ప తమ పార్టీకి మనుగడ లేదని వైసీపీ శ్రేణులే పేర్కొనడం గమనార్హం...!



## క్యాన్సర్ బాధితురాలికి..
# మంత్రి నారాయణ సాయం

ఇటీవల క్యాన్సర్ వ్యాధితో అనారోగ్యం పాలైన నెల్లూరు 9వ డివిజన్ కుసుమ హరిజనవాడకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ మహిళ నాయకురాలు సిహెచ్ మంగమ్మను రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షులు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి పరామర్శించారు. ఈనెల 3న వారు ఆమె నివాసానికి వెళ్లి ఆమె ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. ఆమె కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. తనవంతు సాయాన్ని చెక్కురూపంలో వారికి అందజేశారు. గత ఎన్నికల్లో తన గెలుపు కోసం మంగమ్మ కష్టపడి పని చేశారని, అలాంటివారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని అంటూ, మంగమ్మ వైద్యానికయ్యే ఖర్చు మొత్తాన్ని తన సొంత నిధులతో తానే భరిస్తానని నారాయణ హామీ ఇచ్చారు.

# కుంభమేళాకి ఆర్టీసీ బస్సు రెడీ

- కాశీ, అయోధ్యలను కూడా చూడొచ్చు!
- 8 రోజుల యాత్ర..ఛార్జీ 9వేలు మాత్రమే

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న కుంభమేళాని దర్శించుకోవాలనుకున్న భక్తులకు నెల్లూరు ఆర్టీసీవారు ప్రత్యేకబస్సును ఏర్పాటుచేశారు. కుంభమేళాతో పాటు కాశీ, అయోధ్య పుణ్యక్షేత్రాలను కూడా దర్శించుకునే అవకాశం కూడా కల్పిస్తున్నారు. ఈ సూపర్ లగ్జరీబస్సులో ఛార్జీ మాత్రం 9వేల రూపాయలుంటుంది. టిఫిన్, భోజనం, వసతి వగైరాలన్నీ భక్తులే చూసుకోవాల్సి ఉంటుందని ఆర్టీసీ నెల్లూరు 1వ డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ నుంచి ఈ బస్సు బయలుదేరుతుందని, హైదరాబాద్-నాగపూర్‌ల మీదుగా ప్రయాణంచేసి రెండవరోజు సాయంత్రానికల్లా ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళా వద్దకి చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. మూడోరోజు అక్కడే బసచేసి, నాలుగోరోజు రాత్రికి అయోధ్యకు వెళ్తుందని, అయిదోరోజు బాలరాముని దర్శించుకుని, ఆ రాత్రికి కాశీకి బయలుదేరుతుందని, ఆరవరోజు కాశీకి చేరుకుని అక్కడే బసచేసి, ఏడవ రోజున అక్కడినుంచి బయలదేరి, ఎనిమిదవరోజు రాత్రికి నెల్లూరుకు చేరుకుంటుందని వివరించారు.

### టూరిజం సంస్థ బస్సులు

ప్రయాగ్ రాజ్ కుంభమేళాకి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. బస్సులు నెల్లూరు నుండి బయలుదేరి విజయవాడ, రాజమహేంద్రవరం, అన్నవరం, విశాఖపట్నం, పూరి, కోణార్క్, భువనేశ్వర్, కటక్, చండీపూర్, గయ, బుద్ధగయ, కాశీల మీదుగా కుంభమేళా జరిగే ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటాయి. అదేవిధంగా, తిరుగు ప్రయాణంలో ప్రయాగరాజ్ నుంచి శ్రీకూర్మం, అరసవెల్లి, విశాఖపట్నం, విజయవాడ మీదుగా నెల్లూరుకు వస్తాయి. కుంభమేళాకు వెళ్లే ఈ ప్రత్యేకబస్సులు ఫిబ్రవరి 12వ తేదీ ఉదయం 6గంటలకు నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయం వద్దనుండి బయలుదేరి ఫిబ్రవరి 18వ తేదీన తిరిగి నెల్లూరుకు చేరుకుంటాయి. ఇందులో పెద్దలకు 25 వేల రూపాయలు, పిల్లలకు రూ.22,500 ఛార్జీ ఉంటుంది. అల్పాహారం, భోజనం ఖర్చులు ఎవరికి వారే భరించాలి. ఇతర వివరాలకు డివిజనల్ మేనేజర్ 9848007024ను సంప్రదించవచ్చని టూరిజం వర్గాలు తెలిపాయి.

## కమిషనర్ సీసీ నిర్బంధం కేసులో..
# మరో ఇద్దరు అరెస్ట్

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సీసీగా పనిచేస్తున్న ప్రవీణ్‌ను నిర్బంధించిన కేసులో దర్గామిట్ట పోలీసులు ఈనెల 3న మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. గత నెల 25న ప్రవీణ్‌ను నిర్బంధించిన ఘటనకు సంబంధించి ఇప్పటికే మేయర్ భర్త జయవర్ధన్‌ను అరెస్ట్ చేయగా, తాజాగా ఆయన అనుచరులైన అరుణ్‌కుమార్, సిరాజ్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# కేంద్ర బడ్జెట్ చాలా బాగుంది

## అన్నివర్గాలకు న్యాయం చేసేదిగా ఉందంటూ వేమిరెడ్డి ప్రశంస



వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకునేలా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్.. అన్ని వర్గాలకు సమన్యాయం చేసేదిగా ఉందని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశంసించారు. వ్యక్తిగత ఇన్‌కమ్ టాక్స్ పరిధిని 12 లక్షలకు పెంచడం చాలా గొప్ప నిర్ణయమని, మధ్య తరగతి ప్రజలకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎంఎస్ఎంఇలు, చిన్న పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ కేటాయింపును 5 కోట్ల నుంచి 10 కోట్లకు పెంచడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపన జరుగుతుందన్నారు. అన్ని సంక్షేమ పథకాలకు నిధులను పెంచిన కేంద్ర ప్రభుత్వం, వికసిత్ భారత్ లక్ష్యాల సాధనలో మరో అడుగు ముందుకేసిందంటూ ప్రధానమంత్రి మోడీకి, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కి ఆయన ధన్యవాదాలు తెలిపారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వడంపై ఎంపీ వేమిరెడ్డి సంతోషపడుతూ, కేంద్రం నుంచి నిధులు రాబట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వానికి ఆయన అభినందనలు తెలియజేశారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్లు, విశాఖ స్టీల్‌కు రూ.3,295 కోట్లు, విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్‌కి రూ.186 కోట్లు, ఏపీ ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి రూ.162 కోట్లతో సహా.. పలు ప్రాజెక్టులకు కోట్లాదిరూపాయలను కేటాయించడం ఆనందదాయకమన్నారు.

# నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చింది 'శ్రీనివాసమహల్ సెంటరే'!

**సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**




తనను రాజకీయాల్లోకి తీసుకొచ్చింది నెల్లూరు నగరంలోని శ్రీనివాసమహల్ సెంటరేనని, అప్పట్లో తాము అక్కడే కూర్చుని రాజకీయ విషయాలను చర్చించుకునే వాళ్లమని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఇటీవల స్థానిక ఆర్ఎస్ఆర్ మునిసిపల్ హైస్కూల్ 1969-70 టెన్త్ బ్యాచ్ పూర్వవిద్యార్థులందరూ ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. పాత జ్ఞాపకాలు, తీపి స్నేహాలను గుర్తుతెచ్చుకుని ఆనందించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తాను కూడా ఆ స్కూల్ విద్యార్థినేనని, మా క్లాస్‌మేట్స్ చాలామంది అనేకరంగాల్లో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారని, రాజకీయాల్లోకి రాకుండా వారంతా ప్రశాంతంగా జీవిస్తున్నారని అంటూ, తాను మాత్రం చదువుకు దూరమై రాజకీయాల్లో నేటికీ నిత్యపోరాటాలతోనే గడుపుతున్నానని అన్నారు. ఒకప్పట్లో ఆనం వాళ్లకు ఏసీ సెంటర్ రాజకీయ కేంద్రమైతే, వారి వ్యతిరేక వర్గానికి కేరాఫ్‌గా శ్రీనివాస మహల్ ఉండేదన్నారు. తాను చదువుకున్న ఆర్ఎస్ఆర్ స్కూలే తనకు స్ఫూర్తి అని, అల్లీపురం, నవలాకుతోటల్లో జడ్పీ హైస్కూళ్ల నిర్మాణానికి తమ తండ్రి సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేరుతో కోట్లాది రూపాయల విలువైన స్థలాలిచ్చామని, ఆ స్కూళ్లు బాగా నడుస్తున్నాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# శ్రీసిటీ అభివృద్ధి భేష్!

## ప్రశంసించిన జపాన్ బృందం



ప్రపంచ ప్రఖ్యాత పారిశ్రామికవాడగా రూపుదిద్దుకున్న శ్రీసిటీలో పారిశ్రామిక అభివృద్ధి వాతావరణం ఎంతో బావుందంటూ ఇటీవల శ్రీసిటీకి వచ్చిన జపాన్ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ప్రశంసించింది. పెట్టుబడి అవకాశాల పరిశీలనలో భాగంగా జపాన్‌లోని ఎహైమ్ రాష్ట్రానికి చెందిన 25 మంది ప్రతినిధులు ఈనెల 4న శ్రీసిటీని సందర్శించారు. గవర్నర్ టోకిహిరో నకమురా నేతృత్వంలో వచ్చిన ఆ బృందానికి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రత్యేకతలు వివరించారు. దేశంలో రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ అవతరించిందని చెప్పారు. శ్రీసిటీలో పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడి అవకాశాలు,పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ అంశాలపై ప్రతినిధి బృందం చర్చలు జరిపింది. ప్రపంచశ్రేణి పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్య కృషిని అభినందించిన గవర్నర్ నకమురా, శ్రీసిటీలోని విశాల స్థలం, అద్భుత మౌళిక సదుపాయాలు, పెట్టుబడిదారులకు అనువైన పారిశ్రామిక వాతావరణం బాగున్నాయంటూ ప్రశంసించారు. శ్రీసిటీతో బలమైన వ్యాపారబంధం కోసం తాము ఎదురుచూస్తున్నామని వారు చెప్పారు.

## టూకీగా...



### మాలకొండ ఆదాయం 5.3 లక్షలు

జిల్లాలోని కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలెం మాలకొండలో వెలసివున్న సుప్రసిద్ధ క్షేత్రం శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఈనెల 1న శనివారం భక్తులు పోటెత్తారు. ఆ ఒక్కరోజునే స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలు, ఇతరత్రా సేవల ద్వారా 5,31,471 రూపాయల రాబడి వచ్చినట్లు ఆలయవర్గాలు తెలిపాయి.

### చెంచులక్ష్మీపురంలో పంటపొలాల సందర్శన

బోగోలు మండలం చెంచులక్ష్మీపురం గ్రామంలో ఈనెల 1న వ్యవసాయశాఖ అధికారులు పంటపొలాలను సందర్శించి రైతులకు తగు సూచనలిచ్చారు. మినుము, వేరుశెనగ పంటలకు తెగుళ్ళు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ప్రశాంతి, మండల వ్యవసాయ అధికారిణి విజయలక్ష్మి రైతులకు వివరించారు.

### ఆత్మకూరులో సామూహిక అక్షరాభ్యాసం

వసంత పంచమిని పురస్కరించుకుని ఆత్మకూరు పంటవీధిలో ఉన్న ఆలయంలో శిశుమందిరం వారి ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఆత్మకూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, బీజేపీ నగరాధ్యక్షుడు సంతోష్‌కుమార్-స్వప్న దంపతులు పాల్గొని చిన్నారులకు పలకలు బలపాలు పంపిణీ చేశారు.

### మద్దెలమడుగు విద్యార్థులకు నిత్యావసరాలు

రాపూరు మండలం మద్దెలమడుగు వద్దనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు దాతల సహకారంతో నిర్వహిస్తున్న మధ్యాహ్నభోజనానికి రాపూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఏదోటి కోటినాయుడు ఈనెల 3న 5 బస్తాల బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులను వితరణగా అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌కు వాటిని అందించారు.

### పొదలకూరులో వసంత పంచమి వేడుకలు

పొదలకూరులోని గాయత్రి విద్యామందిర్ ఆధ్వర్యంలో ఈనెల 3న వసంతి పంచమివేడుకలు ఘనంగా జరిగాయి. సరస్వతిదేవి అమ్మవారికి పూజలు చేసి, పిల్లలకు ప్రసాదం పంచిపెట్టారు. విద్యామందిర్ కరెస్పాండెంట్ చైతన్యకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

### జి.చెరువుపల్లిలో మధ్యాహ్న భోజనం తనిఖీ

ఉదయగిరి మండలంలోని జి.చెరువుపల్లి పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి తోట శ్రీనివాసులు ఈనెల 1న ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నభోజనం నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఉపాధ్యాయులు చిరంజీవులు, సారధి, రత్తయ్య, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### సంగంలో ఇసుక నిల్వల పరిశీలన

మండల కేంద్రమైన సంగంలో ఇసుక డంపింగ్ కేంద్రాన్ని ఈనెల 1న ఆర్డీఓ పావని సందర్శించి ఇసుక నిల్వలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. నదినుంచి ట్రాక్టర్ల ద్వారా మాత్రమే ఇసుకను డంపింగ్‌యార్డ్‌కు తరలించాలని సిబ్బందికి చెప్పారు. తహశీల్దార్ సోమ్లానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

### సీతారామపురం స్కూళ్లకు మెటీరియల్ పంపిణీ

సీతారామపురం మండలంలోని 40 పాఠశాలలకు ఈనెల 1న మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో ఫైబర్‌నెట్ మెటీరియల్‌ను మండల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. జియోజిమ్‌లు, కేబుల్, రూటర్‌లు అందజేశారు. బాత్‌రూమ్‌ల శుభ్రతకు అవసరమైన సామగ్రిని కూడా ఇచ్చి, పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

### శంభునిపాళెం గిరిజనులతో సమావేశం

విడవలూరు మండలం ఊటుకూరు పరిధిలోని శంభునిపాళెం గిరిజనులకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణి ఈనెల 1న సమావేశమై బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పట్ల అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా గిరిజనులు శంభునిపాళెంలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుచేయాలని కోరగా, ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆమె చెప్పారు.

# పురాతన ఆలయాలకు పూర్వవైభవం

## రూ.38 కోట్లతో నెల్లూరుజిల్లాలో 18 ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు

### - దేవాదాయశాఖ మంత్రి ఆనం



రాష్ట్రవ్యాప్తంగా పురాతన ఆలయాలకు పూర్వవైభవం తీసుకువస్తున్నామని, ఈ నేపథ్యంలో నెల్లూరుజిల్లాలో 38 కోట్ల రూపాయల వ్యయంతో 18 ఆలయాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఈనెల 4న రథసప్తమి పర్వదినం సందర్భంగా ఆయన నెల్లూరు నగరంలోని మూలాపేటలో కొలువైవున్న శ్రీమూలస్థానేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి మహాశివుడిని, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని సూర్యభగవానుడికి నిర్వహించిన ప్రత్యేక అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. అరసవెల్లిలోని ప్రసిద్ధ సూర్య భగవానుడి ఆలయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా రథసప్తమి వేడుకలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. అదేవిధంగా, అన్ని ఆలయాల్లోని రాతికట్టడాలను యధావిధిగా వుంచేలా, రంగులను తొలగించి పూర్వం ఎలా వున్నాయో అదేవిధంగా నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్ తరాలకు మన ఆలయాల విశిష్టత, చరిత్ర తెలిసేలా, వేదాలు, ఆగమశాస్త్రాలను తప్పకుండా పాటిస్తూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా తమ ప్రభుత్వం ఆలయాల పూర్వవైభవానికి కృషిచేస్తోందని ఆయన వివరించారు.

# దళారుల నుంచి రైతులను కాపాడండి

## వరికి గిట్టుబాటు ధరపై ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సమీక్ష



దళారుల బారినుంచి రైతులను కాపాడాలని, రైతులు పండించిన ప్రతి వడ్ల గింజను ప్రభుత్వం కొనేలా అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులకు సూచించారు. నెల్లూరు నగరం మాగుంట లే-అవుట్‌లోని విపిఆర్ నివాసంలో ఆమె పలుశాఖల అధికారులతో ఈనెల 5వ తేదీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కోవూరు నియోజకవర్గం పరిధిలో సుమారు 60వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగవుతుందని, దాదాపు లక్షా 80వేల పుట్ల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామని చెప్పారు. ఫిబ్రవరి నెలాఖరు నుంచి వరి కోతలు ప్రారంభం కానున్న నేపధ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ, రైతులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం పుట్టి ధాన్యానికి 19,720 రూపాయలుగా ధర ప్రకటించి ఉందని, అధికారులు చొరవ తీసుకొని అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలన్నారు. రైతులు తొందరపడి ధాన్యం దళారులకు అమ్మవద్దని, ఖరీఫ్ మరియు రబీ 2024-25 సీజన్లు పూర్తయ్యేవరకు ధాన్యం సేకరణ జరుగుతుంటుందని తెలిపారు. కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా 80కి పైగా రైతుసేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, ప్రభుత్వం ఏర్పాటుచేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# వెంకటాచలం నగరవనానికి రూ. 2 కోట్లు



వెంకటాచలంలో నగరవనం ఏర్పాటుకు 2 కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తున్నామని, భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని నిధులు కూడా ఇస్తామని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చెప్పారు. ఈనెల 5న ఆయన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి నగరవనాన్ని పరిశీలించి, అధికారులతో దాని అభివృద్ధి విషయమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సోమిరెడ్డి రాజకీయంగా కానీ, అభివృద్ధి పరంగా కానీ ఏదైనాసరే, పట్టుబడితే అది సాధించేదాకా వదలరని అంటూ, నెల్లూరు నగరానికి ఈ నగరవనం ఒక టూరిజం స్పాట్‌గా మారడం ఖాయమన్నారు. సోమిరెడ్డి సారధ్యంలో నగరవనం రాష్ట్రంలోనే అద్భుతంగా తీర్చిదిద్దబడుతుందన్నారు. తొలుత ఆయన ఈ ప్రాంతం అడవిలో ఉన్న శివాలయాన్ని సందర్శించి శ్రీ అభయలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రస్తుతం 'అడవిలో శివయ్య'గా పిలవబడుతున్న అభయలింగేశ్వరస్వామి భవిష్యత్తులో నగరవనంలో శివయ్యగా మారడం తథ్యమన్నారు.

# నర్రవాడ జనార్ధనస్వామి సేవలో.. చిన్నజీయర్‌స్వామి!

దుత్తలూరు మండలం నర్రవాడ గ్రామంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి వారి ఆలయ జీర్ణోద్ధరణ మహా సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా జనవరి 30 నుండి ఫిబ్రవరి 3వ తేది వరకు జరిగిన పూజాకార్యక్రమాల్లో శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి వారు పాల్గొని ప్రత్యేకపూజలు అభిషేకాలు నిర్వహించారు. ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ పాల్గొని ఆలయ శిఖరం పైనున్న కలశానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన చిన్నజీయర్ స్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయ చైర్మన్ మాదాల ఎస్.బాబురావు, ఆర్.కృష్ణయ్య తదితరులు వారిని సాదరంగా స్వాగతించారు.





# వైభవోపేతం..శ్రీనివాస పెరుమాళ్ కుంభాభిషేకం

## • చెన్నైలో శ్రీసిటీ-శ్రీవాణి ఆధ్యాత్మిక శోభ

శ్రీసిటీ-శ్రీవాణి ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య వేదిక ఇటీవల చెన్నైలో శ్రీ శ్రీనివాస పెరుమాళ్ ఆలయ కుంభాభిషేకం, త్యాగరాజ సంకీర్తనార్చన కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించింది. చెన్నై రాయపేటలోని శ్రీదేవి భూదేవీ సమేత శ్రీ శ్రీనివాస పెరుమాళ్ ఆలయంలో ఈనెల 3న శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ మరియు ఆలయ కమిటీ ఛైర్మెన్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆధ్వర్యంలో కుంభాభిషేక మహోత్సవం కన్నులపండువగా జరిగింది. తమిళనాడు ప్రభుత్వ హిందూ మత పరిరక్షణ, ధార్మిక సంస్థల శాఖ మంత్రి పి.కే.శేఖర్ బాబు తదితర ప్రముఖులు పాల్గొన్నారు. డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కే.ఈ.హెచ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్..ఆలయ ధర్మకర్త వసంత్‌కుమార్, ఆలయ కమిటీ కార్యదర్శి పి.రవీంద్రకుమార్‌రెడ్డి తదితరులకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కుంభాభిషేకానికి ముందు రోజున శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి నేతృత్వంలో వేదపండితులు యాగాలు, విశేష పూజలు, ధార్మిక ప్రవచనం, వేదపారాయణం వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

## అలరించిన త్యాగరాజ సంకీర్తనార్చన

చెన్నై వేద విజ్ఞాన వేదికతో కలసి చెన్నైలోని ఆంధ్రా క్లబ్ గోదావరి హాలులో శ్రీసిటీ-శ్రీవాణి చేపట్టిన త్యాగరాజ సంకీర్తనార్చనా విభావరిలో నెల్లూరుకు చెందిన కుమారి మల్లాది అనూష బృందం ఆలపించిన త్యాగరాజ కీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనూషతో పాటు, తిరుపతికి చెందిన సాయి శివ శ్రవణ్, అక్కిశెట్టి నరేష్, చెన్నైకి చెందిన కుమారి పవిత్ర పాల్గొన్నారు. వయోలిన్‌పై సంకీర్తకుమార్, మృదంగంపై కృష్ణవంశి వాద్య సహకారం అందించారు. వారందరినీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వేదవిజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు తదితరులు ఘనంగా సత్కరించారు. ఆస్కా అధ్యక్షులు సుబ్బారెడ్డి, అనేక మంది తెలుగు ప్రముఖులు, సాహితీవేత్తలు పెద్దసంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



# దానకర్ణి

## ఆమె సంపాదనంతా.. ఆ ఏడుకొండలవాడికే

### • ఎస్వీ బాలమందిర్ ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళమిచ్చిన దాత



కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులున్నారు. టీటీడీకి చెందిన వివిధ ట్రస్టులు, పథకాలకు పెద్ద మొత్తాల్లో విరాళాలిచ్చే దాతలెందరో ఉన్నారు. అయితే, ఈనెల 3న శ్రీవారికి అందిన విరాళం మాత్రం చాలా అరుదైనదనే చెప్పవచ్చు. భారత్ సహా పలు దేశాల్లో విపత్తు అధికారిగా సేవలు అందించిన ఓ మహిళ, తన జీవితంలో ఆదా చేసిన ప్రతి పైసాను భద్రంచేసి వెంకన్నకు కానుకగా సమర్పించి దానకర్ణులను మరపించింది ఈ దానకర్ణి. రేణిగుంటకు చెందిన శ్రీమతి సి.మోహన మనదేశంతో పాటు కొసావో, అల్బేనియా, యెమెన్, సౌదీ అరేబియాలలో అభివృద్ధి-విపత్తు నిర్వహణ రంగాలలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆమెకు ఏడుకొండలవాడంటే అమిత భక్తి. అంతేకాదు, తన వృత్తిజీవితంలో ఆదా చేసిన ప్రతి రూపాయిని శ్రీవారికి కానుకగా ఇవ్వాలని నిర్ణయించుకుని, ఆ విధంగా ఆదా చేసిన 50 లక్షల రూపాయలను ఇటీవల టీటీడీకి చెందిన శ్రీ వెంకటేశ్వర సర్వ శ్రేయాస్(ఎస్వీ బాలమందిర్) ట్రస్ట్‌కు విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని డీడీ రూపంలో తిరుమలలోని టీటీడీ అదనపు ఇఓ సిహెచ్.వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె దాతృత్వాన్ని వెంకయ్యచౌదరి కొనియాడారు. మూడున్నర దశాబ్దాలకు పైగా తన వృత్తి జీవితంలో సంపాదించిన ధనాన్ని, గోవిందుడి కృపతో అనాథలు, పేదలకు ఉపయోగపడాలనే ఆమె నిర్ణయం ప్రశంసనీయమని అన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com